Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 227 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 6 సెప్టెంబర్ 2023 | బుధవారం | పేజీలు : 4

## కర్ణాటకకు మరో వందేభారత్ రైలు

బెంగళూరు : రాష్ట్రానికి మరో వందేభారత్ రైలు మంజూరైంది. పాలక్కాడ్ – దక్షిణ రైల్వేల మధ్య సంచరించనుంది. రెండు రోజుల క్రితం చెన్నై ఫ్యాక్టరీ నుంచి వందేభారత్ రైలు మంగళూరుకు చేరింది. రైలును పాలక్కాడ్ విభాగానికి అప్పగించనున్నారు. అయితే ట్రాక్ పనులు సాగుతున్నందున సంచారం మరింత ఆలస్యం కానుంది. మంగళూరు – బెంగళూరుల మధ్య 90 కిలోమీటర్ల విద్యుద్దీకరణ పనులు సాగుతున్నాయి. పూర్తి కాగానే సంచారం ఆరంభం కానుందని దక్షిణకన్నడ ఎంపీ నళిన్‌కుమార్ కటీల్ ప్రకటించారు. ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చలు జరిపినట్టు తెలిపారు. ప్రస్తుతం చెన్నై – బెంగళూరు – మైసూరు, బెంగళూరు – హుబ్బళ్ళిల మధ్య రెండు వందేభారత్ రైళ్లు సంచరిస్తున్నాయి. మరో రైలు మంగళూరు ప్రాంతానికి రానుంది.



# 'ఇండియా'ను నీరుగార్చే కుట్రేనా!

## జమిలి ఎన్నికలు!!

హైదరాబాద్: ఈ సంవత్సరం చివరలో రాజస్థాన్, ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ రాష్ట్రాలలో బీజేపీ పరిస్థితి ఏమంత బాగా లేదు. ఇలాంటి పరిస్థితులలో ప్రతిపక్ష కూటమి ముందుకు వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొనే ఎన్నికల నిర్వహణపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోంది. ప్రతిపక్షాలు పూర్తిగా బలపడక ముందే లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించాలని మోడీ ప్రభుత్వం దూరాలోచన చేస్తోంది. ఏదేమైనా రాబోయే రోజులు ఉత్కంఠగా సాగబోతున్నాయి. జీ-20 సదస్సు నుండి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ఏర్పాటు వెనుక ఉన్న అసలైన ఉద్దేశం వరకూ పరిణామా లన్నీ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించబోతున్నాయి. అలాగే ప్రజాస్వామ్య రక్షణ, కార్పొరేట్ దోపిడీ, ఇండియా సమావేశం వంటి అంశాలు ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయి. న్యూఢిల్లీ లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏదో అతిపెద్ద, అనూహ్య నిర్ణయమే తీసుకో బోతోంది. అయితే అదేమిటో ఊహించడం కష్టంగానే ఉంది. ఒకటి మాత్రం నిజం. సార్వత్రిక ఎన్నికలు అషామాషీగా జరగబోవడం లేదు. ప్రభుత్వ అధికారుల నుండి సామాన్య కార్మికుల వరకూ అందరి దృష్టీ రాబోయే ఎన్నికల పైనే. ఈ ఎన్నికలలో మోడీ ప్రభంజనం ఉండబోదని మాత్రం అందరూ చెబుతున్న మాట. గత నెల 30–ఈ నెల 1 మధ్యకాలంలో దేశంలో రెండు ముఖ్యమైన ఘటనలు జరిగాయి. ఒకటి ముంబయిలో రెండు రోజులపాటు జరిగిన ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం. బీజేపీపై పోరుకు కలసికట్టుగా ముందుకు సాగాలని, ఉమ్మడి అభ్యర్థులను నిలపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇక మరో ముఖ్యమైన ఘటన ఏమంటే ఈ నెల 18 నుండి ఐదు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిన ప్రకటన. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నినాదంలో భాగంగా దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని, అందుకోసం లోక్‌సభ ఎన్నికలను ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వదంతులు వ్యాపిస్తు న్నాయి. దీనిపై ప్రభుత్వం హడావిడిగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది కూడా. అంతేకాద . ఇందులో ప్రభుత్వ దురుద్దేశం కూడా ఉంది. దేశంలో ప్రతిపక్షాలకు అనుకూలంగా మారుతున్న వాతావరణాన్ని దెబ్బతీసేందుకే మోడీ ప్రభుత్వం జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తెస్తోంది. నరేంద్ర మోడీ సన్నిహితుడైన పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా తాజాగా బయటపడిన అవినీతి ఆరోపణలు దేశంలో దుమారం రేపుతున్నాయి. దీని నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం జమిలి ఎన్నికలపై హడావిడి చేస్తోందన్న వాదన కూడా వినిపిస్తోంది.

**బలపడుతున్న ఇండియా** : ఈడీ, సీబీఐ వంటి ప్రభుత్వ విచారణ సంస్థలు ఎన్ని దాడులు చేస్తున్నప్పటికీ ప్రతిపక్ష ఇండియా కూటమి రోజురోజుకూ బలోపేతమ వుతోంది. ఎన్నికలలో ముఖాముఖి పోరు తప్పదన్న అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహా యిస్తే దేశంలోని మిగతా ప్రాంతాలలో బీజేపీ కూటమి, ఇండియా కూటమి మధ్య ద్విముఖ పోరు జరగడం ఖాయంగా కన్పిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంపై ఇండియా కూటమిలో అంతర్గతంగా ఏకాభిప్రాయం కుదిరిందని సమాచారం. సీట్ల సర్దుబాటే ప్రధాన సమస్య. అయినప్పటికీ కలసికట్టుగా పోరాడాలని ప్రతిపక్షాలు అభిప్రాయ పడుతున్నందున బీజేపీకి సవాలు తప్పేలా లేదు. ఎందుకంటే 2019 ఎన్నికలలో ఎన్డీయే కూటమికి 42% ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ తరువాత అనేక భాగస్వామ్య పక్షాలు ఆ కూటమికి టాటా చెప్పాయి. బీజేపీ ప్రభుత్వ విధానాల పట్ల అసంతృప్తి అంతకంతకూ పెరగడంతో పాటు, క్రమేణా మోడీ హవా తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియా కూటమి బలోపేతం కావడం బీజేపీకి సవాలుగా పరిణమించింది.

**డిసెంబర్‌లోనే ఎన్నికలు....? :** ఓ వైపు ఇండియా కూటమి సమావేశమవుతున్న సమయంలోనే బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ 'ప్రత్యేక' సమావేశాలపై ప్రకటన చేసింది. ఇండియా కూటమి సమావేశంపై మీడియాలో వస్తున్న ప్రచారాన్ని పక్కదారి పట్టించేందుకే ఈ సమావేశాలను ముందు కు తెచ్చారన్న వాదన విన్పిస్తోం ది. డిసెంబర్‌లోనే సార్వత్రిక ఎన్నికలు జరిపేందు కు వీలుగా ఈ సమావేశాలు ఆలోచన అని అభిప్రాయమూ వ్యక్తమవు తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతిపక్ష కూటమి ఐక్యత నుండి ప్రజల దృష్టి మరలించేందుకే కేంద్రం ఈ వ్యూహం పన్నినట్లు అర్థమవుతోంది.

**ఇదొక విడ్డూరం :** ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయమేమంటే మోడీకి అత్యంత సన్నిహితుడిగా చెబుతున్న పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీపై తాజాగా వచ్చిన ఆరోపణలు. వీటి వల్ల మోడీ ప్రతిష్టకు వాటిల్లిన నష్టాన్ని పూడ్చడం ప్రభుత్వానికి కష్టమవుతోంది. ఇక చేసేదేముంది..? ప్రజల దృష్టిని మళ్లించడమే మిగిలింది. అందులో భాగంగానే జమిలి ఎన్నికలను తెర పైకి తెచ్చారు. ' ఒకే దేశ ఒకే ఎన్నిక ' పై దేశవ్యాప్తంగా వాడి వేడి రాజకీయ చర్చకు తెరతీశారు.

అంతేకాద . మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీని కూడా వేశారు. ఒక మాజీ రాష్ట్రపతి ఈ తరహా కమిటీలకు నాయకత్వం వహించిన దాఖలాలు ఇప్పటి వరకూ లేవు.




## ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమైన స్క్రీనింగ్ కమిటీ

**తెలంగాణలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఎమెల్యే అభ్యర్థులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యులు స్క్రీనింగ్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. పీసీసీ నిర్దేశించినట్లు కాకుండా బీసీలకు, మహిళలకు అత్యధిక సీట్లు ఇచ్చేందుకు చొరవ చూపాలని స్క్రీనింగ్ కమిటీని కోరారు. ఇవాళ రెండో రోజు డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీల నుంచి స్క్రీనింగ్ కమిటీ అభిప్రాయ సేకరణ చేసింది.**

## కొత్త అసెంబ్లీ ఫైలు మళ్లీ తెర మీదకు



హైదరాబాద్ : ప్రజల మనసుల్ని ఎలా గెలుచుకోవాలి? అందుకు ఏమేం చేయాలి? తాము అధికారంలో ఉన్న వేళ.. గతంలోని ప్రభుత్వాలు చేయని ఎన్నో పనులు తాము మాత్రమే చేస్తున్నామన్న భావన కలిగేలా చేసే విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కున్న ప్రత్యేకమైన టాలెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన తర్వాత వరుసగా రెండుసార్లు అధికారాన్ని సొంతం చేసుకున్న కేసీఆర్.. తన ఏలుబడిలో పలు భారీ భవనాల్ని ఏర్పాటు చేయటం తెలిసిందే. విమర్శలు ఎన్ని ఎదురైనా తాను నిర్మించాలని డిసైడ్ అయిన వేళ.. సచివాలయాన్నికూల్చేసి మరీ దాని స్థానే కొత్త సచివాలయాన్ని ఏర్పాటు చేయటం తెలిసిందే. పాత భవనాన్ని కూల్చేసి కొత్తది కట్టటం ఏమిటి? అన్న విమర్శల్ని ఆయన ఖాతరు చేయలేదు.

అయితే.. కొత్త సౌధాన్ని నిర్మించిన తర్వాత.. ప్రజలంతా అబ్బురపడిపోయి.. ఆనందపడుతున్న సంగతి తెలిసిందే. ఈ కొత్త భవనం ముందు.. పాత భవనాన్ని అవసరం లేకున్నా కూల్చేశారన్న విషయాన్ని ప్రజలు మర్చిపోవటం చూస్తే.. కేసీఆర్ ఎత్తుగడ ఎలా ఉంటుందన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికే పలు భవనాలు.. కట్టడాల్ని పూర్తి చేసిన ఆయన.. ఇప్పుడు కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలన్న పాత ఫైలును కొత్తగా కదిల్చినట్లుగా చెబుతున్నారు. నిజానికి కొత్త అసెంబ్లీ భవనాన్ని 2019లోనే శంకుస్థాపన చేసినప్పటికీ.. కోర్టు ఆదేశాల కారణంగా అడుగు ముందుకు పడలేదు. కొత్త సచివాలయాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతోనే.. ఎర్ర మంజిల్ లో కొత్త అసెంబ్లీ భవనాన్ని కూడా నిర్మించాలని భావించినా.. హెరిటేజ్ కట్టడం అంటూ విమర్శలు రావటం.. కోర్టు ఆర్డర్ తో ఆ అంశం పక్కకు వెళ్లిపోయింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. అధునాతన సౌకర్యాలతో కొత్త అసెంబ్లీ భవనాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రకటనను ఆయన చేస్తారంటున్నారు. కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలన్న ప్రకటన చేయటం ద్వారా.. మరో ఐకానిక్ భవనం హైదరాబాద్ కు సొంతమవుతుందన్న భావన కలుగుతుందని.. ప్రజల్లో కూడా సానుకూలత వ్యక్తమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే.. దీని కారణంగా ఓట్లు పడతాయని చెప్పలేం కానీ.. కేసీఆర్ సర్కారు ఉంటే.. ఇలాంటి భవన నిర్మాణాలు షెడ్యూల్ ప్రకారం పూర్తి అవుతాయన్న నమ్మకం ప్రజల్లో ఉండటం కేసీఆర్ కు సానుకూలంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మైలేజీ కోసం దేనికైనా సరే అనే కేసీఆర్ సర్కారు... అవసరానికి అనుగుణంగా కొత్త అసెంబ్లీ భవన ప్రకటనను మళ్లీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మాత్రం చెప్పక తప్పదు.



# ఎన్నికలు దగ్గర పడేకొద్దీ...

# పెరిగిపోతున్న కోవర్టుల గోల

హైదరాబాద్ : ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తెలంగాణాలో కోవర్టుల గోల పెరిగిపోతోంది. కాంగ్రెస్ బీజేపీ బీఎస్పీలో కేసీయార్ కోవర్టులు ఉన్నారనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. తన కోవర్టులను ఇతర పార్టీల్లోకి ప్రవేశపెట్టడం కేసీయార్ కు చాలా అవసరమని ఇతర పార్టీల్లోని నేతలంటున్నారు. తన కోవర్టులిచ్చిన సమాచారం ఆధారంగానే ప్రత్యర్థిపార్టీలను ఇబ్బందిపెట్టేట్లుగా కేసీయార్ వ్యూహాలు రచిస్తుంటారనే ప్రచారానికి ఆరోపణలకు కొదవేలేదు. కేసీయార్ కోవర్టుల విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్వయంగా అంగీకరించారు. అలాగే బీజేపీ నేతలు కూడా దీన్ని పరోక్షంగా అంగీకరించారు. చాలాకాలం కిందట రేవంత్ మాట్లాడుతు పార్టీలోని కేసీయార్ కోవర్టులంతా వెంటనే బయటకు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వెళ్ళటం ఇష్టంలేకపోతే కోవర్టు పనులు మానుకుని పార్టీకోసమే పనిచేయాలని బంపర్ ఆఫరిచ్చారు. అంటే దీని అర్థమేంటి ? కాంగ్రెస్ లో కేసీయార్ కోవర్టులున్నారని రేవంత్ అంగీకరించినట్లే కదా. అందుకనే వెంటనే కేసీయార్ కోవర్టులెవరో చెప్పాలంటు బహిరంగంగానే కొందరు సీనియర్లు రేవంత్ ను డిమాండ్ చేశారు. ఇప్పటి సంగతి తెలీదుకానీ ప్రత్యేక తెలంగాణా ప్రకటించకముందు చాలామంది కాంగ్రెస్ నేతలు కేసీయార్ కు అనుకూలంగా పనిచేశారనే ప్రచారం జరిగింది. కేసీయార్ చెప్పిన మాటలనే కాంగ్రెస్ సీనియర్ నేతల్లో చాలామంది సోనియాగాంధి రాహుల్ గాంధీలకు తమ సొంత అభిప్రాయాలుగా చెప్పినట్లు అప్పట్లో బాగా ఆరోపణలొచ్చాయి. చివరకు ప్రత్యేక తెలంగాణా ప్రకటించగానే టీఆర్ఎస్ ను కేసీయార్ కాంగ్రెస్ లో కలిపేస్తారని నమ్మబలకటం కూడా కోవర్టుల వ్యూహమేనని చెప్పుకున్నారు. ఇక బీజేపీలో కూడా కేసీయార్ కోవర్టులున్నారని ఈమధ్యనే ఆరోపణలు మొదలయ్యాయి. మరా కోవర్టులను పార్టీ గుర్తించిందా లేదా అన్నది తెలీలేదు. ఇక బీఎస్పీలో కేసీయార్ కోవర్టులంటేనే ఆశ్చర్యంగా ఉంది. బీఎస్పీకి ఉన్నదెంత పోయేదెంత ? రాబోయే ఎన్నికల్లో పోటీచేస్తే కానీ బీఎస్పీకి ఉన్న సీనేంటో తెలీదు. ఇంతోటిదానికి బీఎస్పీలో ప్రత్యేకంగా కేసీయార్ కోవర్టులను ప్రవేశపెట్టాలా అన్నదే ఆశ్చర్యంగా ఉంది.

ఏదేమైనా ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ పై పార్టీల్లో కేసీయార్ కోవర్టులనే గోల కూడా పెరిగిపోతోంది. మరి కోవర్టులు ఎప్పటికి బయటపడతారో ఏమో చూడాల్సిందే.

# సంపాదకీయం

## జమిలి ఇప్పటికిప్పుడు సాధ్యమా?

ఇంతకాలం రాజకీయ వర్గాల చర్చల్లో మాత్రమే వినిపించే జమిలి ఎన్నికలకు సంబంధించి మోదీ నాయకత్వంలోని కేంద్ర సర్కారు అనూహ్యంగా తెర మీదకు తీసుకురావటం తెలిసిందే. దీంతో.. ఇప్పుడు చర్చ మొత్తం జమిలి చుట్టూనే జరుగుతోంది. మోదీ సర్కారు అనుకున్నట్లుగా జమిలి ఎన్నికల్ని త్వరలో నిర్వహించే వీలుందా? అంటే.. లేదనే మాట బలంగా వినిపిస్తోంది. ఎందుకంటే.. ఇంత పెద్ద దేశంలో ఒకేసారి లోక్ సభ ఎన్నికలతో పాటు 28 రాష్ట్రాల్లో (అన్ని కాకున్నా వీలైనన్ని ఎక్కువ రాష్ట్రాల్లో) ఎన్నికల్ని ఒకే దఫా నిర్వహించటం అంటే అంత మామూలు విషయం కాదు. ఒకవేళ.. అన్ని రాష్ట్రాలు కాకున్నా.. మెజార్టీ రాష్ట్రాలు అనుకున్నా.. అదెంత తేలికైన విషయం కాదు. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారు మోదీ సర్కారు నిర్ణయంపై కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇంతకూ వారేం చెబుతున్నారు? అన్న విషయంలోకి వెళితే..ఒకే దేశం.. ఒకే ఎన్నికలు మాట వినేందుకు బాగానే ఉన్నా.. ఆచరణలో అంత తేలికైన విషయం కాదంటున్నారు. ఒకేసారి ఎన్నికలకు సిద్ధం కావాలంటే కనీసం ఒకట్రెండు సంవత్సరాల ప్రణాళిక.. కార్యాచరణ ఉండాలని చెబుతున్నారు. గతంలోనూ ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించే సామర్థ్యం ఉన్నా.. ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ ఎక్కువని గుర్తు చేస్తున్నారు. 1952-1967 మధ్యలో పెద్ద టెక్నాలజీ అందుబాటులో లేకున్నా దేశం మొత్తానికి ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించిన ట్రాక్ రికార్డు ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కాకుంటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని ఇబ్బందులు ఎదురవొచ్చని చెబుతున్నారు. అన్నింటికి మించి ఇప్పటికిప్పుడు మూడు నాలుగు నెలల్లో ఎన్నికల్ని నిర్వహించటం సాధ్యం కాదని.. దానికి కనీసం ఒక ఏడాది నుంచి వర్కువుట్ చేస్తే కానీ జమిలి ఎన్నికల్ని నిర్వహించే వీలుండదు. గతంలో అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగేవి. తర్వాతి కాలంలో ఆయా రాష్ట్రాల్లో చోటు చేసుకునే పరిణామాలు.. కేంద్రంలోని ప్రభుత్వ బలాబలాలు మారటంతో ఆ షెడ్యూల్ గాడి తప్పింది. దీంతో.. ప్రతి ఏడాది ఎన్నికల మీద ఎన్నికలు రావటంతో.. కేంద్రం పాలన మీద కంటే రాజకీయ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తోంది. దీంతో.. తిరిగి జమిలి ఎన్నికల దిశగా అడుగులు వేయాలని ప్రధాని మోదీ భావిస్తున్నారు. అయితే.. ఒకేసారి ఎన్నికల్ని నిర్వహించేందుకు అన్ని పార్టీల మద్దతు అవసరం. దీంతో పాటు రాజ్యాంగానికి.. ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలి. వీటితో పాటు భారీ స్థాయిలో కేంద్ర పోలీసు బలగాలు.. ఈవీఎంలు.. వీవీ ప్యాట్లు అవసరం అవుతాయి. వాటి తయారీకి భారీగా నిధులు అవసరమవుతాయి. ఇవన్నీ చేసేందుకు కనీసం ఏడాది నుంచి రెండేళ్లు అవసరమవుతాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ వ్యాప్తంగా 25 లక్షల లోపు ఈవీఎంలు ఉన్నాయి. కానీ.. ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే కనీసం 40 లక్షల ఈవీఎంలు అవసరం అవుతాయి. మరి.. అన్ని తయారు చేయించాలంటే భారీ బడ్జెట్ అవసరపడుతుంది. ఇలా ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ ఉన్న నేపథ్యంలో జమిలి ఎన్నికలు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదంటున్నారు. లేదంటే.. మిని జమిలి ఎన్నికలు జరిపి.. ఎన్నికలు నిర్వహించని రాష్ట్రాలను ఏకం చేసి.. వాటికి సపరేటుగా ఎన్నికలు నిర్వహించేలా చేయాల్సి ఉంటుంది. కానీ.. ఆ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందిస్తాయా? అన్నది మరో ప్రశ్న. మొత్తంగా ఒక దేశం.. ఒక ఎన్నిక అన్న నినాదం.. మాట చెప్పినంత ఈజీ కాదని మాత్రం చెప్పక తప్పదు.

# నిర్వహణలో నిర్లక్ష్యం.. స్వచ్ఛత ప్రశ్నార్థకం



గోదావరిఖని : ఇంటింటా చెత్త సేకరణ, సేంద్రియ ఎరువు తయారీలో ఒకప్పుడు ఆదర్శంగా నిలిచిన రామగుండం నగరపాలిక ఇప్పుడు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రామగుండంలో చెత్త నిర్వహణ తీరుపై గతంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు అధ్యయనం చేశారు. అతి తక్కువ జనాభా కలిగిన పట్టణ స్థానిక సంస్థలు సైతం చెత్త నిర్వహణలో దూసుకుపోతుండగా రామగుండం మాత్రం వెనకబడి పోతుంది. నగరాల్లో స్వచ్ఛతను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ఏటా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీల్లో దేశంలోని వివిధ పట్టణాలు పోటీ పడుతూ అత్యుత్తమ ర్యాంకు సాధన దిశగా పయనిస్తుంటే ఇక్కడ మాత్రం తిరోగమిస్తోంది. స్వచ్చత పోటీలో 2021లో 92వ ర్యాంకు సాధించిన రామగుండం 2022లో 136వ ర్యాంకునకు పడిపోవడమే దీనికి నిదర్శనం.

వాహనాలు నిరుపయోగం... కొలిక్కి రాని డంపింగ్ యార్డు

స్వచ్ఛతలో రామగుండం నగరపాలికను ఆదర్శంగా తీర్చిదిద్దుతామనే లక్ష్యంతో సుమారు రూ.5 కోట్లకు పైగా వెచ్చించి అత్యాధునిక వాహనాలను కొనుగోలు చేసిన అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. దీంతో వాహనాలు తుప్పు పట్టి పోతుండగా వాటిపై వెచ్చించిన నిధులు వృథా అయ్యాయి. రహదారులు ఊడ్చే యంత్రం నుంచి మొదలుకొని చెత్త పీల్చుకునే యంత్రం, చెత్తను కంప్రెస్ చేసి తరలించే కంపాక్టర్లు, వాటిని తరలించే హుక్ లోడర్ వాహనం ఇలా అనేక వాహనాలను కొనుగోలు చేసిన నగరపాలిక వాటిని వినియోగించడం లేదు. కంపాక్టర్ల కోసం ప్రత్యేకంగా గౌతమినగర్, మల్కాపూర్‌లో ప్రత్యేక షెడ్లు నిర్మించి వదిలేశారు. డంపింగ్ యార్డు సమస్య తీరడం లేదు. గత కొన్ని దశాబ్దాలుగా సింగరేణి స్థలాన్ని నగరపాలిక డంపింగ్ యార్డుగా వినియోగించుకుంటుండగా తాజాగా గనుల విస్తరణలో భాగంగా ఆయా ప్రాంతాల్లో చెత్త వేసేందుకు సింగరేణి అనుమతించడం లేదు. ఆ తర్వాత నగరంలోని పలు చోట్ల చెత్త పడేసేందుకు బల్దియా ప్రయత్నించగా ఆయా ప్రాంతవాసులు అడ్డుకోవడంతో ప్రస్తుతం గోదావరి ఒడ్డున చెత్తను పడేస్తున్నారు. ఇప్పటికే స్థానిక పరిశ్రమల వ్యర్థాలతో గోదావరి జలాలు కలుషితమవుతుండగా ఆ పక్క స్థలాన్నే నగరపాలిక డంపింగ్ యార్డుగా వినియోగిస్తుండటంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

'పొడి' సరే...'తడి' సంగతి?

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తడి, పొడి చెత్త నిర్వహణతో పాటు బహిరంగ మల, మూత్ర విసర్జన, మురుగు నిర్వహణ కీలకం కానుంది. రామగుండంలో మాత్రం కేవలం పొడి చెత్త నిర్వహణ కొనసాగుతుండగా మిగతా అంశాలను బల్దియా పట్టించుకోవడం లేదు. గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రంలోనే పొడిచెత్త సేకరణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కార్మికులే పొడిచెత్తను వేరుచేసి ఈ కేంద్రంలో కిలో ఒక్కంటికి రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రతిరోజు 70 నుంచి 90 కిలోల వరకు పొడి చెత్త సమకూరుతుంది. దానిని సేకరించే గుత్తేదారు ప్యాకింగ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండడంతో కొంతమేరకు సమస్య పరిష్కారమైనట్లు భావిస్తుండగా తడిచెత్త సమస్య తీరడం లేదు. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేసేందుకు సైతం గౌతమినగర్‌లో సేంద్రియ ఎరువు తయారీ కేంద్రంతో పాటు ఎన్టీఆర్ నగర్, జ్యోతినగర్‌లో ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణం చేపట్టినా నేటికీ వినియోగానికి నోచుకోవడం లేదు. సుమారు రెండేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ఆయా కాలనీల్లోని మహిళల సహకారంతో అక్కడికక్కడే సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాలను నిర్వహించడంతో 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో కొంత మెరుగైన ర్యాంకు వచ్చినప్పటికీ ఆ తర్వాత నిర్వహణ గాడి తప్పడంతో ర్యాంకు దిగజారింది. రామగుండంలో చెత్త నిర్వహణపై 'స్వచ్ఛ సర్వేక్షణ్-2023' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయగా మరో రెండు నెలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రత్యేక బృందాలు రానున్నాయి.

ర్యాంకుల సాధన ప్రశ్నార్థకమే..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకుల సాధనలో ఓడీఎఫ్(బహిరంగ మలవిసర్జన రహితం), జి.ఎఫ్.సి.(చెత్త రహిత ప్రాంతం)తో పాటు నీటి నిర్వహణ కీలకం. రామగుండంలో మురుగు నీటి నిర్వహణ వ్యవస్థ లేకపోవడంతో ఒడీఎఫ్ ప్లస్‌తోనే సరిపెట్టుకోవాల్సి వస్తుండగా, నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తుండటంతో జి.ఎఫ్.సి. ధ్రువీకరణ రావడం లేదు. మురుగు జలాల శుద్ధి కేంద్రం లేకపోవడంతో రామగుండంనకు కేవలం ఓడీఎఫ్ ప్లస్ ధ్రువీకరణ మాత్రమే లభించనుంది. పెద్దపల్లి పురపాలిక ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌నకు ఎంపిక కావడం గమనార్హం. గతంలో జి.ఎఫ్.సి. త్రీస్టార్ రేటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా అర్హత సాధించకపోవడంతో ఈ సారి సింగిల్ స్టార్ రేటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఓడీఎఫ్ ప్లస్ ఉంటే 400 మార్కులు మాత్రమే రానుండగా ప్లస్‌ప్లస్ ఉంటే మార్కులు రెట్టింపు కానున్నాయి. వీటికి తోడుగా మురుగు జలాల శుద్ధి కేంద్రం ఉంటే వాటర్ సిటీ అంశంలో 1000 మార్కులు పడే అవకాశముంది. ఇవన్నీ సక్రమంగా ఉంటే స్టార్ రేటింగ్‌లో మరో 500 నుంచి 1250 మార్కులు రానున్నాయి. రామగుండం నగరపాలకవర్గం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్వహణను పట్టించుకుంటే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించే అవకాశముంది.

# మరింత సహకారం




జగిత్యాల : దేశంలో ఐదేళ్లలో 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికో సంఘం ఉండాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోనూ ప్యాక్స్‌ల సంఖ్య పెరగనుంది. ప్యాక్స్‌ల ద్వారా 25 రకాల సేవలను అందించాలని కేంద్రం నిర్ణయించగా ఈ సానుకూలత జిల్లా రైతులకూ ఉపకరించనుంది. జిల్లాలో ఇప్పటికే 51 ప్యాక్స్‌లుండగా 380 గ్రామపంచాయతీల్లో కనీసం మరో 50 గ్రామాల్లో నూతనంగా ప్యాక్స్‌లను ఏర్పాటుచేసే వీలుండటం కర్షకులకు కలిసిరానుంది.

సంఘాల్లో రైతులే సభ్యులుగా, వాటాదారులుగా ఉంటుండగా కేంద్రం నూతనంగా సహకారశాఖను ప్రారంభించి నాబార్డు ద్వారా సంఘాలకు ఆర్థిక సాయాన్ని అందిస్తుండగా ఇదే తరుణంలో రాష్ట్రప్రభుత్వం కూడా సంఘాల ఆధ్వర్యంలో సాగురంగ సేవలను విస్తృతం చేసేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో జగిత్యాల జిల్లాలోనే అత్యధికంగా ప్యాక్స్‌లుండగా చాలామంది రైతులు ప్యాక్స్‌లలో సభ్యులుగా నమోదు కాలేదు. జిల్లాలో 1.75 లక్షల మంది రైతులుండగా కేవలం 96 వేల మంది మాత్రమే సభ్యులుగా ఉండగా ఇందులోనూ 59 వేలమంది వరకే సంఘాల్లో ఓటుహక్కును కలిగి ఉండటం సభ్యత్వ నమోదు వెనుకంజను వెల్లడిస్తోంది. ప్యాక్స్‌ల సంఖ్యను పెంచుతారు కాబట్టి రైతులందరూ వారి పరిధిలోని సహకార సంఘాల్లో సభ్యులుగా నమోదై రాయితీ పథకాలను పొందేలా సంఘాల పాలకమండళ్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతుసంఘాలు, అధికారులు చర్యలు చేపట్టాల్సిఉంది.

**సంఘాల అభివృద్ధి** జిల్లాలోని అన్నిసంఘాల పరిధిలో ధాన్యం, మక్కలను కొనుగోలు చేస్తుండగా జగిత్యాల, రాయికల్ తదితర సంఘాలు కేంద్ర ప్రభుత్వ రసాయన ఎరువుల సంస్థ క్రిభ్‌కోలో రూ.50 లక్షల చొప్పున వాటాధనం చెల్లించి సాలీనా రూ.10 లక్షల డెవిడెంట్‌ను పొందుతున్నాయి. చాలాసంఘాలు పెట్రోలు పంపులను నిర్వహిస్తుండగా విత్తనశుద్ధి ప్లాంట్లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు కృషిచేస్తున్నాయి. నాబార్డుద్వారా చాలా సంఘాలకు రూ.20 లక్షల చొప్పున నిధులను అందించగా గోదాములను నిర్మించారు. ప్యాక్స్‌ల ఆధీనంలోనే అత్యధిక ధాన్యం సేకరణ ఉండగా ధాన్యం, మక్కల సేకరణతో వచ్చిన కమీషన్ సంఘాలకు ఆర్థికంగా ఉపకరిస్తోంది. ఏటా సంఘాల ద్వారా రైతులకు రూ.180 కోట్లవరకు పంటరుణాలను అందిస్తున్నారు. సంఘాల పరిధి గ్రామాల్లోని గోదాముల్లో రాయితీ విత్తనాలు, ఎరువులను నిల్వచేసి రైతులకు విక్రయిస్తుండటంతో రైతులకు స్థానికంగానే ఉత్పాదకాలు లభిస్తున్నాయి. వాహన రుణాలు, బంగారం రుణాలు, పురుగుమందుల విక్రయం, మంచినీటి ప్లాంటు, రేషన్ దుకాణం తదితరాలను కూడా చాలాచోట్ల సంఘాల ద్వారానే చేపడుతుండటంతో వీటిపాత్ర కీలకంగా మారింది.

నూతన సహకార విధానం ప్రకారం సంఘాల ద్వారానే సేంద్రియ సాగును ప్రోత్సహించటం, బిందుసేద్య పరికరాలను ఇవ్వటం, ఉపాధిహామీ పథకంలో నారునుపెంచి మొక్కల పంపిణీ చేపట్టడం, విత్తనశుద్ధి కేంద్రాల ఏర్పాటు, భూసార పరీక్ష కేంద్రాల ఏర్పాటు, వ్యవసాయ, ఉద్యాన శాఖల రాయితీ పథకాలను

అమలు చేయటం, జీవన ఎరువుల తయారీ కేంద్రాల ఏర్పాటు తదితరాలు ప్రభుత్వ ఉద్దేశ్యంగా ఉండగా ఇవన్నీ అమలైతే సంఘాలు మరింతగా శక్తివంతమవుతాయి. బ్యాంకింగ్ కౌంటర్లు, లాకర్ల సదుపాయం, తక్కువ వడ్డీకి అప్పులివ్వటం, డిపాజిట్ల సేకరణ తదితరాలతోనూ చాలాసంఘాలు తమ పాత్రను పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంఘాలకు బకాయిఉన్న వడ్డీ రిబేటు రూ.110 కోట్లను, పావలావడ్డీ రీఎంబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుంది.

**సభ్యులకే లాభాలు**సంఘాల లాభాల్లోనూ రైతులకు వాటా ఉంటుండగా సంఘాల్లో ఎరువులను కొనుగోలు చేసిన రైతులకు బీమా వంటి సదుపాయాలున్నాయి. అన్ని సంఘాల్లోనూ వాటి పరిధి గ్రామాలు, పట్టణాల రైతులను సభ్యులుగా చేర్చేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్నిప్రాంతాల రైతులు స్వతహాగా ముందుకువచ్చి సభ్యులుగా చేరాలి.
ఎస్.రామానుజాచార్య, సహకారశాఖ జిల్లా అధికారి

# ఎర్రదండు వాలుతోంది

కమ్మర్‌పల్లి: అనుకూలమైన వాతావరణం ఉండటంతో ఆర్మూర్ సీడ్ డివిజన్లో ఈసారి ఎర్రజొన్న బాగా పండింది. కోతలు మొదలై ఆశించినంత దిగుబడి వస్తోంది. అన్నదాత సంతోషానికి అడ్డుపుల్ల వేస్తూ మళ్లీ వ్యాపారులంతా ఒక్కటయ్యారు. ఒకే ధరకు కొనుగోలు చేయాలని చూస్తున్నారు. ఇది రైతులకు శాపంగా మారింది. విపణిలో డిమాండ్ ఉన్నా ఆ స్థాయి ధర చెల్లించకుండా దగా చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ముందస్తు ఒప్పందం చేసుకోలేదు కదా! అని బుకాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట నిల్వ చేసుకోవాలని కర్షకులు భావిస్తున్నారు.

తగ్గిన విస్తీర్ణంతో.. : జిల్లాలో విత్తనజొన్న సగటు విస్తీర్ణం 39,702 ఎకరాలు. ఒప్పందాల్లో నెలకొన్న సందిగ్ధంతో రైతులంతా మొక్కజొన్న వైపు మళ్లారు. ఫలితంగా 29,961 ఎకరాల్లోనే సాగైంది. గతంతో పోలిస్తే సుమారు 2 లక్షల క్వింటాళ్ల దిగుబడి తగ్గనుంది. దీనికి తోడు రెండు నెలలుగా గోదాముల్లో నిల్వ చేసిన పంటను పూర్తిగా ఖాళీ చేశారు. రూ.4 వేలకు వ్యాపారులు అమ్ముకున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కచ్చితంగా ధర



పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

రూ.800 తక్కువ చేసి.. : పంట చేతికొచ్చే దశలోనే మోర్తాడ్‌లో క్వింటాకు రూ.4 వేలు చెల్లిస్తూ ఒప్పందాలు రాసుకోవడానికి సిద్ధమైన వ్యాపారులు అంతలోనే అమాంతం తగ్గించారు. వర్తకులంతా జతకట్టి మళ్లీ మాట తప్పారు. క్వింటాకు రూ.3,200కు మించి చెల్లించలేమని పేర్కొంటున్నారు. ఈ లెక్కన క్వింటాకు రూ.800 తగ్గించేశారు. గ్రామాల్లోకి నేరుగా రాకుండా దళారుల ద్వారా చెప్పించే ప్రయత్నాలు ప్రారంభించారు. శివరాత్రి వరకు కాంటా వేయమంటూ సాగుదారులను నిరీక్షింపజేయాలని చూస్తున్నారు.

రైతన్న అనాసక్తి : వ్యాపారుల పన్నాగం గుర్తించిన కర్షకులు ఉత్పత్తిని అమ్ముకోవడానికి అంగీకరించడం లేదు. నూర్పిడి చేసిన పంటను సంచుల్లో నింపి నిల్వ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట మండలాల్లో కొందరు ఇళ్లల్లోనే నిల్వ చేశారు. తక్కువ ధరకు విక్రయించొద్దని తోటివారికి సూచిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో కొనుగోళ్లు కనిపించడం లేదు. సంఘటితంగా ఉంటే వ్యాపారులు దిగొస్తారని అన్నదాతలు భావిస్తున్నారు.

అమ్మొద్దని నిర్ణయించాతొమ్మిది ఎకరాల్లో పంట సాగు చేశా. దిగుబడి ఎకరానికి 20 క్వింటాళ్లు వస్తున్నా.. ధర ఆశాజనకంగా లేదు. డిమాండ్ ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేయాలని కుట్రలు చేస్తున్నారు. రైతులంతా ఒకే మాటపై నిలబడాలి. క్వింటాకు రూ.4 వేలు వచ్చేంత వరకు అమ్మకుండా ఓపిక పట్టాలి. తొందరపడి విక్రయించి మోసపోవద్దు.ప్రవీణ్, హాసాకొత్తూర్

# స్వచ్ఛతకు పరుగులు!

పాలమూరు : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 వైపు పురపాలికలు పరుగులు పెడుతున్నాయి. 2016లో ప్రారంభమైన ఈ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏఒక్క పురపాలిక కూడా భాగస్వామ్యం కాలేదు. 2017లో దేశవ్యాప్తంగా 77 నగర, పురపాలక సంఘాలు పాల్గొనగా మహబూబ్‌నగర్ పురపాలక సంఘానికి అవకాశం దక్కింది.

జనవరి నుంచి పోటీలు ప్రారంభం కావడంతో జాతీయ, జోనల్ స్థాయిల్లో ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు మరోమారు ర్యాంకుల కోసం పోటీ పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలనకు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ థర్డ్‌పార్టీ బృందాలు ఈనెల 22 నుంచి పురపాలికల్లో పర్యటించనున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పరిగణలోకి తీసుకుంటే పాలమూరు పురపాలికలోనే వందశాతం ఓడీఎఫ్ అమల్లో ఉందనే చెప్పాలి. ఈ పురపాలికకు గత ఏడాది ఓడీఎఫ్‌లో ప్లస్ ర్యాంకు వచ్చింది. ఈసారి డబుల్ ప్లస్ ర్యాంకు కోసం పోటీ పడుతోంది.

పట్టణంలో ఇంటింటికీ మరుగుదొడ్లు ఉన్నాయా? లేదా? వ్యర్థాల నిల్వకు సెప్టిక్ ట్యాంకులు నిర్మించారా లేదా? ప్రజా మూత్రశాలలు ఉన్నాయా లేదా? అనే అంశాలపై గత ఏడాది సర్వేక్షణ్‌లో పాలమూరు పురపాలిక పోటీ పడగా ప్లస్ ర్యాంకు వచ్చింది.

ఈసారి ప్రజా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, దివ్యాంగులు, చిన్నారులు మహిళలకు సౌకర్యాలు కల్పన వంటి అంశాలు పరిశీలిస్తారు. అన్నీ సౌకర్యాలు ఉంటే మార్కులు బట్టి ఈ ఏడాది పోటీల్లో ఓడీఎఫ్ కింద డబుల్ ప్లస్ ర్యాంకు వస్తుంది.

ఉమ్మడి జిల్లాలోని గద్వాల, వనపర్తి, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, కోస్గి, నాగర్‌కర్నూల్, అలంపూర్, వడ్డేపల్లి, ఆత్మకూర్, భూత్పూర్ పురపాలక సంఘాలు సైతం గత ఏడాది ఓడీఎఫ్‌లో పోటీ పడి ప్లస్ ర్యాంకులు సాధించాయి. ఈ ఏడాదికి డబుల్ ప్లస్ ర్యాంకులకు జాతీయ, జోనల్ స్థాయిలో సన్నద్ధమవుతున్నాయి.చివరగా వచ్చే సర్వేక్షణ్ బృంద సభ్యులు ఆయా పురపాలికలకు జాతీయ, జోనల్ స్థాయిలో వచ్చిన ర్యాంకులు పరిగణలోకి తీసుకొని పట్టణాల్లో తడిపొడి చెత్త సేకరణ ఎలా జరుగుతుందో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాయి.

పురపాలికలకు డంపింగ్‌యార్డులు.. సేంద్రీయ ఎరువు తయారీ ప్లాంట్లు పరిశీలించి వివరాలు సేకరిస్తాయి.

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, వనపర్తి పురపాలికలు మినహా ఇతర పురపాలికల్లో డంపింగ్‌యార్డులు లేవు. సేంద్రీయ ఎరువు తయారీ ప్రక్రియ జరగడం లేదు. తడిపొడి చెత్తసేకరణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది.

ఓడీఎఫ్, జీఎఫ్‌సీలకు ప్రాధాన్యం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ ఏడాది ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ), జీఎఫ్‌సీ (గార్బేజ్ ఫ్రీ సిటీ) నిర్వహణకు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ప్రాధాన్యం ఇవ్వనుంది. ప్రతి పురపాలిక బహిరంగ మలమూత్ర విసర్జన పట్టణంగా (ఓడీఎఫ్) ఉండాలి. ప్రతి ఇంటి ఆవరణలో మరుగుదొడ్డి ఉండడంతో పాటు, వ్యర్థాలు సెప్టిక్‌ట్యాంకులోకే వదలాలి. కూడళ్లల్లో రహదారుల వెంట, కాలువల్లో ఎక్కడా చెత్త, దుర్గంధం కనిపించరాదు. పట్టణమంతా చెత్తరహితంగా (జీఎఫ్‌సీ) కనిపించాలి. రెండు ప్రధాన అంశాలు ఎజెండాగా ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు జరగనున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నాయి. మొదట ఓడీఎఫ్ పరిశీలన, అనంతరం జీఎఫ్‌సీ కోసం వేర్వేరుగా రెండు బృందాలు వస్తాయి. మూడో బృందం చివరగా వస్తుంది.

# ఆర్టీవో కార్యాలయం.. దరి చేరేదెప్పుడో..!

దేవరకొండ : దేవరకొండ డివిజన్ చందంపేట, డిండి, పీఏపల్లి, దేవరకొండ, కొండమల్లేపల్లి, గుడిపల్లి, చింతపల్లి, నేరెడుగొమ్ము, గుర్రంపోడు, నాంపల్లి, మర్రిగూడ పది మండలాలతో విస్తరించి ఉంది. వీటిలో మారుమూల గిరిజన ప్రాంతమైన డిండి, చందంపేట మండలాలు నల్గొండ జిల్లాకు చివరన ఉంటాయి. దాదాపు నాగర్‌కర్నూల్ జిల్లాను ఆవరించి ఉంటాయి. చందంపేట మండలం పొగిళ్ల గ్రామం దేవరకొండకు 60 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. వీరు వాహనాలు కొనుగోలు చేసినప్పుడు అవస్థలు అంతా ఇంతా కాదు. ఆటో, ద్విచక్రవాహనం రిజిస్ట్రేషన్, లైసెన్సు రెన్యువల్, ఓనర్‌షిప్ మార్పిడి, ఫిట్‌నెస్ చేపట్టాలంటే మిర్యాలగూడకు వాహనం తీసుకొని వెళ్లాల్సిందే. మిర్యాలగూడ దాదాపు 130 నుంచి 150 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఖర్చుతో పాటు వ్యయ ప్రయాసంగా మారుతుంది.

ప్రభుత్వానికి ఆదాయం..

దేవరకొండ నియోజకవర్గంలో దాదాపు 20 వేల ద్విచక్ర వాహనాలు, 2 వేల వరకు ఆటోలు, 2 వేల వరకు నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ట్రాక్టర్లు దాదాపు 1,200 వరకు ఉంటాయి. వీటితో పాటు లారీలు 800 వరకు ఉంటాయి. ఈ వాహనాల సంఖ్య ఏడాదికి



కొంత పెరుగుతూ వస్తుంది. అయితే వీటికి లైసెన్సు, రిజిస్ట్రేషన్ కావాలంటే మిర్యాలగూడ వరకు వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కొన్నవారే. దేవరకొండ డివిజన్ కేంద్రంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సైతం చేకూరుతుంది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై జరిమానా విధించే అవకాశం ఉంటుంది.పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించినా.. ఆర్సీ, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, రోడ్ పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్సు లేనివారిపై చర్యలు తీసుకొని జరిమానా విధించ వచ్చు.

2023 మార్చిలో డిండి మండలం గోనబోయినపల్లి గ్రామానికి చెందిన యువకుడు కొత్త వాహనం కొన్నాడు. తన స్నేహితునితో కలిసి రిజిస్ట్రేషన్ కోసం మిర్యాలగూడ బయల్దేరారు. దేవరకొండ మండలం మైనంపల్లి వద్ద ఎదురుగా బోరు వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వాహనదారులు లైసెన్సు పొందాలన్నా.. వాహనం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా.. కొండ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని ఇక్కడి వాహనదారులు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకుంటున్నారు.

# క్రీడామైదానం తరలింపుపై స్పష్టత కరవు

నిజామాబాద్ :ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నేతల హామీలు జోరందుకుంటున్నాయి. ఇటీవల మంత్రి కేటీఆర్ పర్యటించి డివిజన్‌కు రూ.కోటి చొప్పున రూ.60 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో పెండింగ్ పనులపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించారు. కానీ, జిల్లాకేంద్రంలో మైదానం ఏర్పాటుపై ఎలాంటి కదలిక లేదు. కనీసం ఫలానా చోట నిర్మిస్తారని ప్రకటించిన దాఖలాలు లేవు. పాత కలెక్టరేట్‌లో కళాభారతి భవనం నిర్మిస్తున్న క్రమంలో అక్కడున్న మైదానం తరలించనున్నట్లు సమాచారం. కొత్త మైదానానికి స్థల కేటాయింపుపై స్పష్టత లేకపోవడంతో క్రీడాకారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు నూతన మైదానం నిర్మాణంపై స్పష్టతివ్వాలని కోరుతున్నారు.అలసత్వం ఎందుకు?

జిల్లా నుంచి దేశం గర్వించిన క్రీడాకారులు నిఖత్ జరీన్, హుస్సాముద్దిన్, యెండల సౌందర్య, గుగులోత్ సౌమ్య, మలావత్ పూర్ణ వంటి వారు త్రివర్ణ పతాకాన్ని ప్రపంచ వేదికలపై రెపరెపలాడించారు. వీరి గురించి గర్వంగా చెప్పుకొనే జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడా మైదానం ఏర్పాటులో అలసత్వం ఎందుకు వహిస్తున్నారనే విమర్శలున్నాయి. పాత కలెక్టరేట్‌లో కళాభారతి భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. అక్కడి మైదానం నిర్మాణానికి కేటాయిస్తే జిల్లా కేంద్రంలో ఆటస్థలం ఉండదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేతలు సామాజిక మాధ్యమాల్లో క్రీడా మైదానం గురించి



చర్చించడమే కానీ ప్రత్యక్షంగా పోరాడడం లేదని సీనియర్ క్రీడాకారులు అంటున్నారు.

ఇచ్చిన స్థలం సరిపోతుందా..

జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం పక్కన, భారాస కార్యాలయం వెనకాల సుమారు ఎకరం ముప్పై గుంటల స్థలం ఉంది. దీనిని మైదానానికి కేటాయిస్తున్నారంటూ ప్రచారం కొనసాగుతోంది. పూర్తిస్థాయి మైదానానికి ఈ స్థలం సరిపోదని పలువురు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో దీనిని ఇక్కడి నుంచి తరలించకుండా చూడాలని మరి కొందరు కోరుతున్నారు.

నగరంలోనే ఏర్పాటు చేయాలి

ఖైసర్, మాజీ అథ్లెట్‌జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొంటున్న నాయకులు క్రీడా మైదానాన్ని నిర్మించకుండా ఆటగాళ్లకు నష్టం మిగులుస్తున్నారు. గతంలో ఖలీల్‌వాడి మైదానం తొలగించారు. ఇప్పుడూ అదే పునరావృ తమవుతోంది.

ఎలాంటి సమాచారం లేదుముత్తెన్న, నిజామాబాద్ డీవైఎస్‌వోడీఎస్ఏ మైదానం తరలించడం, కొత్త మైదానం కోసం స్థలం కేటాయిస్తున్నారనే అంశాలపై స్పష్టత లేదు. ఇతరులు అంటే వినడం తప్ప ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

# అక్షరాల్లో ఒదిగి.. ఉత్తములుగా ఎదిగి

సూర్యాపేట :బాధ్యతగా విధులు నిర్వర్తించి.. భావి పౌరులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల కృషికి ఫలితం దక్కింది. అక్షరాల్లో తాము ఒదిగి.. చిన్నారులు ఎదిగేలా సానబెట్టిన ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో పని చేస్తున్న గురువులను.. వివిధ విభాగాల్లో ఉత్తములుగా ఎంపిక చేసింది. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన గురువులపై ప్రత్యేక కథనం.

'పవిత్ర'మైన వృత్తిలో.. ఉత్తములుగా..మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు ఎక్కడుంటే అక్కడ మారం పవిత్ర ఉంటారు. తాజాగా రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సూర్యాపేట జిల్లా నుంచి ఆమె మరోసారి ఎంపికయ్యారు. విద్యార్థులకు సులభతరమైన విద్యనందిస్తూ జీవ శాస్త్రంలో అనేక పరిశోధనలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. జాతీయ స్థాయి సారాబాయి టీచర్ సైంటిస్ట్ అవార్డుతోపాటు పదుల సంఖ్యలో జిల్లా, రాష్ట్ర స్థాయి పలు విభాగాలలో అవార్డులు దక్కించుకున్నారు. డిజిటల్ తరగతులతో పాటు పలు పుస్తకాలలో పాఠ్యాంశాల రూపకర్తగా ఉన్నారు. గడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో తొమ్మిది సంవత్సరాలుగా జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నారు. ప్రయోగాలతో పాటు ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్స్, సైన్స్‌ఫేర్ వంటి వాటిల్లో రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడంలో ఆమె పాత్ర కీలకమైంది. రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని పవిత్ర చెప్పారు. నిత్యం విద్యాభివృద్ధితో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు నిరంతరం కృషి చేయడం వారి ఉన్నతికి తోడ్పటమే తన కర్తవ్యమన్నారు.

బోధనలో మెప్పించి.. పిల్లలను ప్రోత్సహించి

పిల్లలతో మమేకమై బోధనలో ప్రత్యేకతను చాటుకుంటూ విద్యార్థులను చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించిన రేపాక నర్సింహారెడ్డికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు లభించింది. నల్గొండ జిల్లా కేంద్రంలోని మాధవనగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల జేబీఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 1995లో ప్రభుత్వ విద్యారంగంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా నియామకమైన ఆయన గత 29 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూనే విద్యార్థులను అన్నిరంగాల్లో ప్రోత్సహించారు. జిల్లాస్థాయిలో జరిగే వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సహించి బహుమతులు సాధించేలా కృషిచేశారు. మొక్కలు నాటడం, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర విషయాలపై విద్యార్థులను ప్రోత్సహించారు. నల్గొండ అంధుల పాఠశాలలో ట్యాంకు నిర్మాణం, భోజన ప్లేట్లు, బల్లలు దాతల ద్వారా సమకూర్చారు. జిల్లాస్థాయిలో ఇప్పటికే పలు అవార్డులు అందుకున్న ఆయనకు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సాహాన్ని నింపడమే కాకుండా బాధ్యత పెంచినట్లు చెప్పారు. అభ్యసనతో పాటు ఇతర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ విద్యార్థులను ప్రోత్సహించడం వల్లే ఈ అవార్డు దక్కినట్లు పేర్కొన్నారు.

'కళ' నాగయ్యగా..మద్దిరాల మండలం గోరెంట్ల మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కల్లూరి నాగయ్య ప్రత్యేక కేటగిరీలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన నాగయ్య కళారంగంలో విశేష సేవలందిస్తున్నారు. పౌరాణిక పాత్రలు పోషించే వీక్షకులను ఆకట్టుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలలో మొక్కల పెంపకం, విద్యార్థులకు కళలపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న ఈయన సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

కృషికి దక్కిన పురస్కారం

మూడు దశాబ్దాలకు పైగా ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన తుంగతుర్తి మండలం వెంపటి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని చిత్తలూరి వెంకటరామనర్సమ్మకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయిని అవార్డు దక్కింది. నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ.. సర్కారు బడుల్లో రోజురోజుకూ తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఆమె ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర ఏర్పర్చుకున్నారు. అందుకు నిదర్శనం ప్రస్తుతం తాను ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తున్న వెంపటి ప్రాథమిక పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు ఉండటం. బడిబాటలో గ్రామస్థులందరినీ మమేకం చేసి, నిధులు సమకూర్చుకొని పాఠశాలలో అన్ని వసతులు కల్పించారు. పరిసర మానాపురం, రావులపల్లి, రావులపల్లితండా, గాజులగూడెం, తుంగతుర్తి, దేవునిగుట్ట తండాలో పాఠశాలలున్నప్పటికీ ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు ఆటోల్లో వెంపటి పీఎస్‌కు వస్తుండటం విశేషం. ఈ ఏడాది ఈ బడి నుంచి 24 మంది గురుకుల పాఠశాల, 24 మంది ఆదర్శ పాఠశాలలో చదువుకునేందుకు ప్రవేశపరీక్షలో ఎంపికయ్యారు. 12 మంది విద్యార్థులూ క్రీడా పాఠశాలకు ఎంపిక కావడం గమనార్హం. ప్రత్యేక చొరవ తీసుకుని బాలలసభ, బోధనోపకరణాల మేళా, విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ ఆమె అధికారుల మన్ననలు పొందుతున్నారు. ఆమె భర్త రాజయ్య విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. తండ్రితోపాటు సోదరి, సోదరులూ ఉపాధ్యాయులే.

ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకొన్న తమ కుటుంబంలో తనకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయిని అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉందని వెంకటరామనర్సమ్మ తెలిపారు.

అంకితభావం...ఆదర్శనీయం

ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పని చేస్తూ పాఠశాల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చిస్తూ.. సేవలందిస్తున్నందుకు చౌటుప్పల్ పురపరిధి తాళ్లసింగారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం 2023 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి ఎంపిక చేసింది. మోత్కూరు మండలం దత్తప్పగూడానికి చెందిన ఇతని తండ్రి మురహరిరెడ్డి ఉపాధ్యాయుడిగా 35 ఏళ్లు సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు. తండ్రి స్ఫూర్తితో 2002లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన హర్షవర్ధన్‌రెడ్డి చౌటుప్పల్ మండలం పద్మానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తొమ్మిదేళ్లు పని చేశారు. పన్నెండేళ్లుగా తాళ్లసింగారంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆయన ప్రత్యేకతలివే..

ప్రతి రోజు విద్యార్థులకు ఉదయం పది నిమిషాలు స్వయంగా ధ్యానం చేయిస్తారు. తాళ్లసింగారం గ్రామంలోని ఇటుక బట్టీల్లో పని చేయడానికి ఒడిశా, బిహార్ నుంచి వలస వచ్చే కుటుంబాల్లోని పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి వారి మాతృభాషలోనే బోధించేందుకు అక్కడ్నుంచి వలస వచ్చిన కుటుంబాల్లోని విద్యావంతులను టీచరుగా నియమించి బోధన చేయిస్తున్నారు. ఆ టీచరు వేతనం ఇటుక బట్టీల యజమానులతో పాటు తాను కొంత భరిస్తున్నారు. దాతలను సంప్రదించి పాఠశాలకు రూ.లక్ష విలువైన ఫర్నిచర్ సమకూర్చారు. స్వచ్ఛ పాఠశాలగా తీర్చిదిద్ది జిల్లా స్థాయిలో పురస్కారం అందుకున్నారు.

సులభ పద్ధతుల్లో బోధిస్తూ.. సురభి జీవనలత

విద్యా బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన అవసరాలు తీరుస్తూ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల జనంపల్లిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు సురభి జీవనలత. 36 ఏళ్లుగా విద్యా రంగానికి చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం శనివారం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రకటించింది. 1987లో టీజీటీ ఉపాధ్యాయురాలిగా మెదక్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో చేరారు. అనంతరం హైదరాబాద్, నాగార్జునసాగర్, నల్గొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పని చేశారు. రామన్నపేట మండలంలోని జనంపల్లిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయురాలిగా 2015 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. గణితంపై విద్యార్థుల్లో భయం పోగొట్టడం, వైజ్ఞానిక ప్రదర్శనలపై ఆసక్తి పెంచడం, సులభ పద్ధతుల్లో బోధన సాగిస్తున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాఠశాల విద్యార్థులు గణితానికి సంబంధించిన అంశాల్లో బహుమతులు సాధించారు. విద్యార్థులకు డిక్షనరీలు అందించడం, గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్, పాఠశాల ఆవరణలో సొంత నిధులతో సభావేదిక నిర్మించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు రావటం ఉత్సాహానిచ్చిందని.. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవలు కొనసాగిస్తానన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించటానికి కృషిచేస్తానని చెప్పారు జీవనలత.

ప్రత్యేక బోధన.. సేవా తపన

విద్యా బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన అవసరాలు తీరుస్తూ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల జనంపల్లిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు సురభి జీవనలత. 36 ఏళ్లుగా విద్యా రంగానికి చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం శనివారం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రకటించింది. 1987లో టీజీటీ ఉపాధ్యాయురాలిగా మెదక్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో చేరారు. అనంతరం హైదరాబాద్, నాగార్జునసాగర్, నల్గొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పని చేశారు. రామన్నపేట మండలంలోని జనంపల్లిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయురాలిగా 2015 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. గణితంపై విద్యార్థుల్లో భయం పోగొట్టడం, వైజ్ఞానిక ప్రదర్శనలపై ఆసక్తి పెంచడం, సులభ పద్ధతుల్లో బోధన సాగిస్తున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాఠశాల విద్యార్థులు గణితానికి సంబంధించిన అంశాల్లో బహుమతులు సాధించారు. విద్యార్థులకు డిక్షనరీలు అందించడం, గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్, పాఠశాల ఆవరణలో సొంత నిధులతో సభావేదిక నిర్మించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు రావటం ఉత్సాహానిచ్చిందని.. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవలు కొనసాగిస్తానన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించటానికి కృషి చేస్తానని చెప్పారు జీవనలత.

ప్రత్యేక బోధన.. సేవా తపన

పాఠ్యాంశాల బోధనలో ప్రత్యేకత చూపుతూ, పాఠ్య పుస్తకాలు రచిస్తూ, విద్యార్థుల్లో విజ్ఞానం పెంచి ఇన్‌స్పైర్ పురస్కారాలు అందుకునేలా తీర్చిదిద్దుతూ బహుముఖంగా సేవలందిస్తున్నందుకు చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల బయోసైన్స్ ఉపాధ్యాయుడు బాణాల జయరాజ్ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జయరాజ్ 1990లో గరిడేపల్లి మండలం కాల్వపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. తర్వాత బీబీనగర్, బొల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బయో-సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేసి 2015లో చౌటుప్పల్‌కు వచ్చారు.

ఆయన ప్రత్యేకతలివే....బయో-సైన్స్ తొమ్మిదో తరగతి పాఠ్య పుస్తకంలో పర్యావరణ విద్య పాఠాన్ని రచించారు. పదోతరగతి పాఠ్య పుస్తకంలో పలు పాఠాలు ఇతను రాసినవే. రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన సాక్షర భారత్, వయోజన విద్య, ఓపెన్ స్కూల్ కోసం ఉపయోగిస్తున్న 20 పుస్తకాలను రచించారు. 'జయరాజ్ బాణాల' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. అందులో చౌటుప్పల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో రూపొందించిన 750 పాఠాలున్నాయి. కరోనా సమయంలో ఇతను రూపొందించిన వందల కొద్దీ పాఠాలు రాష్ట్ర మంతటా టీ-శాట్ ద్వారా ప్రసారమయ్యాయి. ఎస్సీఈఆర్టీ, ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నిష్ఠ', అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు రీసోర్స్ పర్సన్‌గా ఉన్నారు. బాలల సైన్స్ కాంగ్రెస్‌లకు, ఢిల్లీలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మేళాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేర్ టేకర్‌గా వ్యవహరించారు.

# జిల్లాలో స్తంభించిన వైద్యసేవలు




నిజామాబాద్ : జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో పనిచేసే ఒప్పంద ఉద్యోగులు, 104 సిబ్బంది, ఔట్‌సోర్సింగ్, ఏఎన్ఎంలు సమ్మెకు దిగడంతో ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు స్తంభించాయి. రోగులు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లగా.. అక్కడ సిబ్బంది లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. అధికారుల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, తమ సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లాలనే సమ్మెకు దిగినట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 10 యూపీహెచ్‌సీలు, 22 పీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఎల్‌టీలు, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సులు, మెడికల్ అసిస్టెంట్లు, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆయాలు, స్వీపర్లు ఇలా ప్రతి విభాగం సమ్మెకు దిగడంతో వైద్యం అందించడం గగనంగా మారింది. ఆగస్టు 15 నుంచి ఏఎన్ఎంలు: ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, క్రమబద్ధీకరించాలని కోరుతూ గత 15 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు వీరితోనే నడుస్తాయి. వీరు విధులకు రాకపోవడంతో గర్భిణులు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా వచ్చే రోగులు వైద్యం అందడం లేదని నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వైద్యం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.అన్ని విభాగాల సిబ్బంది..: ఏఎన్ఎంలతో పాటు వారం రోజులుగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌లోని అన్ని విభాగాల సిబ్బంది సమ్మె బాట పట్టారు. జీవో 10 అమలుకాని కేడర్లకు సైతం బేసిక్, ఏడీ, హెచ్‌ఆర్ఏ తదితరాలు కలిపి గ్రాస్ వేతనం నిర్ణయించాల ని, ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. హరియాణా, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో చేసినట్లు తెలంగాణాలోనూ ఎన్‌హెచ్ఎం సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

104 ఉద్యోగులు సైతం..: ఆర్‌బీఎస్‌కే డీఈఐసీ సిబ్బంది(104) సమస్యలు పరిష్కరించాలని పాత కలెక్టరేట్ ఎదుట ఒకరోజు ధర్నా నిర్వహించారు. ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 104 ఎఫ్‌డీహెచ్ఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఏఎన్ఎంలు, రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, ఎఫ్‌డీహెచ్ఎస్ ఉద్యోగులకు వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని నిరసన తెలిపారు.

చాలా ఇబ్బందిగా మారిందిసుదర్శనం, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ సిబ్బంది సమ్మెకు దిగడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసరమైన రోగులు అవస్థలు పడుతున్నారు. 10 మంది చేసే పని ఒక్కరు చేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతాధికారులకు విషయం తెలియజేశాం. చర్చలు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# శతశాతానికి చేరువ

కామారెడ్డి : ఉపాధి కూలీలకు నేరుగా బ్యాంకు ద్వారా చెల్లింపుల ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. జాబ్‌కార్డుల కు, బ్యాంకు ఖాతాలకు ఆధార్‌కార్డుల అనుసంధానం ఇంకా కొనసాగుతోంది. ఏడాదిన్నర కిందటే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. జిల్లావ్యాప్తంగా 3,11,832 మంది క్రియాశీలక ఉపాధికూలీలు ఉండగా అందులో 3,04,548 మందివి ఆధార్ అనుసంధానించారు. కొన్ని సమస్యలు ఉత్పన్నం కావడంతో మిగతా కూలీలు వెనకబడ్డారు. అనుసంధాన ప్రక్రియకు సెప్టెంబరు 1 వరకు చివరితేదీగా నిర్ణయించారు. ఆ తర్వాత గడువును ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పొడిగించారు. జిల్లా వ్యాప్తంగా 2.62 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 98 శాతం ఖాతాలకు ఆధార్ అనుసంధానం పూర్తిచేశారు. అక్రమాలకు చెక్..కూలీలు పనిచేసిన రోజులకు వచ్చే మొత్తాన్ని ఇప్పటి వరకు స్థానిక తపాలశాఖ కేంద్రాల నుంచి నగదు పంపిణీ చేస్తూ వస్తున్నారు. కొన్ని చోట్ల కూలీలకు తెలియకుండా డబ్బులు నొక్కేసిన ఘటనలు జిల్లావ్యాప్తంగా చోటుచేసుకున్నాయి. కూలీ వేలిముద్ర పెట్టగానే నగదు ఉపసంహరించుకుని డబ్బులు రాలేదని చెప్పిన వ్యక్తులు కూడా ఉన్నారు. మరికొన్ని చోట్ల వేలిముద్రలు పెట్టించుకుని నగదు మరుసటి రోజు ఇస్తామని చెప్పి ఉడాయించిన వ్యక్తులపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇవ్వాల్సిన దాని కన్నా కొంత అందజేసి మిగతా మొత్తాన్ని స్వాహా చేసిన వారు కూడా ఉన్నారు. ఇలాంటి అక్రమాలు నిరోధించడానికి బ్యాంకు ఖాతా విధానం ఎంతగానే ఉపకరిస్తుంది. డబ్బులు డ్రా చేయడానికి పల్లెల్లో బ్యాంకులు అందుబాటులో లేవు. దీంతో కూలీలు వారి ఖాతా నంబరు ఇచ్చిన బ్యాంకుకు వెళ్లి డబ్బులు ఉపసంహరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆధార్ అనుసంధానం చేసుకున్నవారు ఇప్పటికే బ్యాంకుల నుంచి నగదు ఉపసంహరించుకుంటున్నారు.

ఉపాధి కూలీలు తమ డబ్బులు వచ్చిన వెంటనే తపాలశాఖ కార్యాలయాల ముందు బారులుదీరేవారు. నూతన చెల్లింపుల విధానంతో వారి కష్టాలు తీరే అవకాశం ఉంది. అనుసంధానం పూర్తయితే ఏటీఎం కార్డులు కలిగి ఉన్నవారు మరింత సులువుగా నగదు ఉపసంహించుకోవచ్చు.

వేర్వేరు పేర్లతో ఇబ్బందులు

పేర్లు వేరువేరుగా ఉండడంతో కొందరి ఉపాధి జాబ్‌కార్డులకు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 7284 మంది కూలీలకు సంబంధించిన వివరాలు రావడం లేదు. వారి ఆధార్‌కార్డులో పేరు ఒకరకంగా జాబ్‌కార్డులో, బ్యాంకు ఖాతాలో మరో విధంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు వివాహం కాకముందు తీసుకున్న ఆధార్ కార్డు అప్‌డేట్ కాకపోవడంతో పుట్టింటి పేరుమీదనే కార్డు కొనసాగుతోంది. అత్త ఇంటి వద్ద తీసుకున్న ఉపాధికార్డుకు జతకావడం లేదు. కొందరి వేలిముద్రలు సరిగా జతకావడం లేదు. ఇలాంటి సమస్యలు పరిష్కరించడానికి కేంద్రం మరో మూడు నెలల పాటు గడువు పొడిగించింది. ఈ నేపథ్యంలో అధికారులు కూలీల ఖాతాలకు ఆధార్‌ను శతశాతం నమోదు పూర్తిచేయడానికి అవకాశం ఉంది.

# టికెట్ దక్కించుకునేదెవరో..!

కామారెడ్డి : భారాసలో కామారెడ్డి మినహా సిట్టింగులకే పార్టీ అధిష్ఠానం టికెట్లు ఖరారు చేసింది. కామారెడ్డి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ పోటీ చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి పెద్దగా పోటీ లేదు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాల కోసం ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. భాజపా ఈ నెల 4 నుంచి 10వ తేదీల మధ్య పార్టీ అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని నిర్దేశించింది. దీంతో పలువురు తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్న తీరుపై కథనం.

కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఇప్పటికే భారాస తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీచేయడం ఖరారైన విషయం తెలిసిందే. ఇక కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ పోటీ చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక భాజపా అభ్యర్థి ఎవ్వరనేది తేలాల్సి ఉంది. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కమలం టికెట్‌ను కాటిపల్లి వెంకటరమణారెడ్డితో పాటు మురళీధర్‌గౌడ్, ఎంజీ వేణుగోపాల్, ఇట్టెం సిద్దిరాములు, కృష్ణాగౌడ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నుంచి ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి తనదైన శైలిలో భారాస ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లోకి వెళ్తూ పార్టీ అగ్రనాయకత్వం దృష్టిలో పడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. స్థానికంగా పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న నాయకుడికే టికెట్ కేటాయించి పోటీకి దింపుతుందా లేదా ఎవరైనా జాతీయ, రాష్ట్రస్థాయి నాయకుడికి టికెట్ కేటాయించి పోటీచేయిస్తుందా అనేది తేలాల్సి ఉంది. ఇటీవల ఇక్కడి నుంచి పలువురు రాష్ట్రస్థాయి నేతలు పోటీచేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రవాసీ యోజనతో బలాబలాలపై ఆరా..

ఇటీవల రాష్ట్ర పార్టీ ఎమ్మెల్యే ప్రవాసీ యోజన కార్యక్రమంలో భాగంగా ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో పర్యటించేలా ఏర్పాట్లు చేసింది. నాలుగు రోజుల పాటు మకాం వేసిన ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులతో పాటు ఎవరు అభ్యర్థి అయితే బాగుంటుందనే దానిపై సమగ్ర సమాచారం సేకరించి అధిష్ఠానానికి నివేదించినట్లు తెలుస్తోంది. ఆయా నివేదికల ఆధారంగానే అభ్యర్థిత్వాలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

బరిలో ఎవరు నిలుస్తారో..

ఎల్లారెడ్డి నుంచి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డిలతో పాటు పైలా క్రిష్టారెడ్డి, మర్రి రాంరెడ్డి, రచనారెడ్డి, బైండ్ల పోచయ్య, మహిపాల్ యాదవ్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. వీరితో పాటు ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, గాంధారికి చెందిన మరో వైద్యుడు సైతం పార్టీ పిలిచి టికెట్ కేటాయిస్తే పోటీచేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పోటీపై ఎటూ తేల్చడం లేదని తెలుస్తోంది. ఆశావహులు అందరూ టికెట్ కోసం దరఖాస్తు చేయాలని పార్టీ నిర్దేశించిన విషయం తెలిసిందే. దీంతో పోటీకి సుముఖంగా ఉన్న వారి వివరాలు తెలువనున్నాయి..

బాన్సువాడ నియోజకవర్గం నుంచి మల్యాద్రిరెడ్డితో పాటు దొరబాబు, లక్ష్మీనారాయణ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మాల్యాద్రిరెడ్డి భాజపాలో చేరారు. అప్పటి నుంచి నియోజకవర్గ బాధ్యుడిగా బాధ్యతలు చేపట్టి పనిచేస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందిన మాల్యాద్రి రెడ్డి ఆయన సహకారంతో టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విధంగా నిజామాబాద్‌కు చెందిన ఓ ముఖ్యనేతను ఇక్కడి నుంచి బరిలోకి దింపితే ఎలా ఉంటుందనే దానిపై పార్టీ అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు నస్రుల్లాబాద్ మండలం నెమ్లికి చెందిన ఓ ప్రముఖ వ్యక్తిని సైతం భాజపా నుంచి పోటీ చేయించాలనే ఆలోచనలో అధిష్ఠానం పెద్దలు ఉన్నట్లు సమాచారం.జుక్కల్ నియోజకవర్గం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతారతో పాటు రేవణ్, నాయుడు ప్రకాశ్‌లు పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు.వీరితో పాటు జుక్కల్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్ఐ బుచ్చయ్య సైతం పార్టీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అరుణతార గత నాలుగేళ్ల నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు చేపడుతూ తన సత్తా చాటుతున్నారు.

# నిర్మాణ పనుల్లో అలసత్వం తగదు: పీఓ

భద్రాచలం : మన్యంలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా చేపట్టిన నిర్మాణ పనుల్లో అలసత్వం ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతను ఇవ్వాలని, నాసి రకానికి చోటు ఇవ్వవద్దని తెల్చిచెప్పారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీతో కలిసి తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పనుల ప్రగతిపై సమీక్షించారు. రహదారులు, ఆశ్రమ పాఠశాలలు, సబ్ సెంటర్లు, ప్రహరీలు, గ్రామ పంచాయతీ భవనాలు గిరిజనులకు ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. నిధులు ఉన్నా పనుల్లో జాప్యముంటే కారణాలను తెలుసుకోవాలని సూచించారు. పనులు ఖరారైనా టెండరుదారులు ముందుకు రాకుంటే ఆ టెండర్లను రద్దు చేయాలని పేర్కొన్నారు. గిరిజన ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయం కల్పించి విద్యుత్తు సమస్య రాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 'ఆది ఆదర్శ గ్రామ యోజన' నిధులు మిగిలితే ఆ నిధులను సమీపంలోని విద్యాలయాలకు కేటాయించాలని సూచించారు. గిరిజన విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను గుర్తించేందుకు ప్రాథమిక స్థాయి అంచనా పరీక్షలు నిర్వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్,



డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్యతో కలిసి గురుకులాల నిర్వాహకులు, ఉపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 60 ఆశ్రమ పాఠశాలలు, 225 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 12,859 మంది విద్యార్థులకు ఈ పరీక్ష ఉపయోగపడనుందన్నారు. 3 నుంచి 7వ తరగతి విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను వెలికితీసేందుకు గురుకుల కళాశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.

రూ.65 తగ్గిన ఆయిల్‌పాం గెలల ధర

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం గెలల ధర టన్నుకు రూ.65 తగ్గింది. జులై నెలకు టన్ను గెలల ధర రూ.13,091 ఉండగా ఆగస్టు నెలకు రూ.13026కు తగ్గింది. ఈ మేరకు హైదరాబాదులో టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఎండీ, మార్కెటింగ్, ఉద్యానశాఖ సంచాలకుల ఆధ్వర్యంలో ధరలను శుక్రవారం నిర్ణయించారు. తగ్గిన ధర ఆగస్టు 1 నుంచి 31 వరకు సేకరించిన గెలలకు అమలవుతుందని ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు.

సార్వత్రిక ప్రవేశాల గడువు పొడిగింపు ఖమ్మం విద్యావిభాగం: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి పదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును పొడిగించినట్లు ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ, ఉభయ జిల్లాల సమన్వయకర్త మద్దినేని పాపారావు ప్రకటించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం నంబర్ 80084 03522ను సంప్రదించాలని సూచించారు.

# నీళ్లు లేని ఊళ్లు..!

కొత్తగూడెం : పచ్చని అరణ్యాలలో చెరగని పచ్చబొట్లలాగా ఉన్న గిరిజన ప్రాంతాలను తాగునీటి సమస్య వేధిస్తోంది. ములకలపల్లి మండలం ఒగ్గెరుగుంపు, పాలవాగు, కొర్రాజులగుట్ట, కుమురంభీం నగర్, ఊట చెరువు వంటి ఆదివాసీ గ్రామాల్లో వాగునీరే తాగునీరవుతోంది. మరికొన్నిచోట్ల ప్రభుత్వం సోలార్ బోర్లు ఏర్పాటు చేసినా సరిగ్గా పనిచేయటం లేదు. గిరిజన మహిళలు కిలోమీటర్ల కొద్దీ కాలినడకన వెళ్లి వాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో సోలార్ పలకలు పనిచేయకపోవడం, విద్యుత్తు సౌకర్యం లేకపోవడం వంటి కారణాలతో తాగునీటి సమస్య తీవ్రమవుతోందని గిరిజనులు



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులు, చెలిమల నుంచి తెచ్చుకున్న కలుషిత నీటిని తాగటం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఏళ్ల తరబడి తిప్పలే.. కొర్రాజులగుట్ట ప్రాంత ప్రజలు తాగునీటి కోసం సెలయేరుపై ఆధారపడుతున్నారు. వేసవికాలంలో అది ఎండిపోతుండటంతో నీటి కోసం నాలుగు కిలోమీటర్లు కాలినడకన వేరే ప్రాంతానికి వెళ్లక తప్పదు. ఒగ్గెరుగుంపు ప్రాంత గిరిజనులు రాళ్లవాగు నీటినే తాగుతున్నారు. పాలవాగు ప్రాంత ప్రజలు ప్రజలు సమీప రాళ్లవాగు నీటినే వినియోగిస్తున్నారు. వర్షాకాలంలో వాగునీరు కలుషితమవుతుండటంతో గిరిజన గ్రామాల్లో టైఫాయిడ్ ఇతర వ్యాధులు ప్రబలుతున్నాయి.

వర్షాకాలంలో కలుషిత నీరు తాగటం వల్ల అనారోగ్యం పాలవుతున్నాం. అధికారులు మా ప్రాంతానికి సమీపంలోని పాలవాగులో సోలార్ బోరు ఏర్పాటుచేసినా దాని నుంచి నీరు మాకందటం లేదు. రాళ్లవాగు నీటినే తాగుతున్నాం. అధికారులు చొరవ చూపి మంచినీటి సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. కుంజ కన్నరాజు, ఒగ్గెరుగుంపు

తాగునీరు, వైద్యం, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదు. మా ప్రాంతంలో ఏది ఏర్పాటు చేయాలన్నా అటవీశాఖ అనుమతివ్వటం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వసతులు సమకూర్చాలి. కొవ్వాసి హైమ, పాలవాగు కొన్ని గిరిజన ప్రాంతాల్లో సోలార్ బోర్లు వేయటానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. మరికొన్నిచోట్ల అటవీశాఖ అనుమతులు లేకపోవటంతో ఏర్పాటు చేయలేకపోతున్నాం. నీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో సోలార్ బోర్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తే కార్యాచరణకు పూనుకుంటాం. వరప్రసాద్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ములకలపల్లి

# సీఎన్‌జీ కొరత.. వాహనదారుల వెత..!



పాల్వంచ : కాలుష్య నివారణలో భాగంగా పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయమైన సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) వాహనాల వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. వీటిని కొనేందుకు కొందరు ఆసక్తి కనబర్చుతున్నారు. అయితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పట్టణాల్లో మినహా మండలాల్లో గ్యాస్ అందుబాటులో లేదు. జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి రావడం, సకాలంలో సీఎన్‌జీ లభ్యం కాకపోవడంతో ప్రజా రవాణాకు వినియోగించే వాహనాలు (ఆటోలు) ఇళ్లకే పరిమితం అయ్యే పరిస్థితి ఎదురవుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు కొత్త ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులను వాహనదారులు వేడుకుంటున్నారు.

సీఎన్‌జీతో నడిచే వాహనాల్లో కార్లతో పోల్చిచూస్తే ఆటోలకు (ప్రజా రవాణా) ఎక్కువ ఆదరణ ఉంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇవి సుమారు 5 వేల వరకు ఉన్నాయి. డిమాండ్‌కు తగినట్లు గ్యాస్ నిల్వలు అందుబాటులో లేవు. అరకొరగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ కేంద్రాల్లో వాహనాలు గంటల తరబడి బారులుదీరాల్సి వస్తోంది. పాల్వంచ, భద్రాచలంలో ఒకటిచొప్పున, ఖమ్మం నగరంలో మూడుచోట్ల మాత్రమే ఫిల్లింగ్ స్టేషన్లు ఉన్నాయి. మిగతా మండలాల వారంతా ఆయాచోట్ల గంటల తరబడి బారులుదీరుతున్నారు. భద్రాచలం, పాల్వంచ పట్టణాల్లోని ఫిల్లింగ్ కేంద్రాలకు రోజుకు సగటున వెయ్యి చొప్పున వాహనాలొస్తున్నట్లు అంచనా. పూర్తి సామర్థ్యం మేర రెండు చోట్ల సుమారు 9 వేల కిలోల గ్యాస్‌ను విక్రయిస్తున్నారు. కొత్తగూడెం పట్టణంలో ఒక స్టేషన్ ఏర్పాటు చేసినా ఇంకా విక్రయాలు మొదలు కాలేదు. ఆదరణ ఉన్న మండలాల్లోనూ కొత్తవి ఏర్పాటు చేస్తే ఎలాంటి సమస్యలుండవని ఆటోల యజమానులు చెబుతున్నారు.

సీఎన్‌జీ నింపుకోవాలంటే జూలూరుపాడు మండలం నుంచి రోజూ పాల్వంచ రావాల్సి వస్తోంది. నాలాగే సుదూర ప్రాంతాల నుంచి వందలాది మంది ఆటో యజమానులు వస్తున్నారు. రెండు, మూడు గంటలు నిరీక్షిస్తే తప్ప మా వంతు రావడం లేదు. ఫలితంగా ఒక్కోరోజు కిరాయిలు వదులుకోవాల్సి వస్తోంది. రెండేళ్లుగా ఇలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రతి మండలంలో ఒక ఫిల్లింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.
మురళి, జూలూరుపాడు

ఉభయ జిల్లాలకు కోదాడ ప్రాంతం నుంచి గ్యాస్ నిల్వలు సరఫరా అవుతున్నాయి కిలో గ్యాస్ (సీఎన్‌జీ) ధర రూ.92

ఆటోలైతే ఒక కిలోతో 45 కి.మీ. మైలేజీ వస్తుంది

వీటిని పెట్రోలుతో నడిపే సౌలభ్యమూ ఉంది

రూ.110 వెచ్చించి పెట్రోలు కొనుగోలు చేస్తే ఆటో మైలేజీ కేవలం 15-18 కి.మీ. మాత్రమే వస్తుంది

సాధారణ డీజిల్ ఆటోలైతే ఒక లీటరుకు 28-30 కి.మీ. మైలేజీతో నడుస్తాయి

# నర్సరీల నిర్వహణలో అవినీతి ఛాయ



పాల్వంచ : 'హరితహారం' పథకం కోసం జిల్లాలోని పంచాయతీల్లో శాశ్వత నర్సరీలను ఏర్పాటు చేశారు. వాటిల్లో నీడ పట్టాల(షేడ్ నెట్) పేరుతో చేతివాటం ప్రదర్శిస్తున్న వైనమిది. గాలిదుమారాలకు ఎగిరిపోయాయని కొందరు, వర్షాలకు తడిచి చిరిగిపోయాయంటూ మరికొందరు నిర్వాహకులు ఏటా రెండు, మూడుసార్లు కొనుగోళ్లు చేసినట్లు చూపుతున్నారు. అందినకాడికి ప్రజాధనం జేబులో వేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో నీడ పట్టాల పేరుతో కొల్లగొట్టిన నిధులతో ఏకంగా శాశ్వత నిర్మాణాలే చేపట్టవచ్చు.

భద్రాద్రి జిల్లాలో..22 మండలాల్లో 481 పంచాయతీలున్నాయి. ప్రతి పంచాయతీలో నర్సరీ నిర్వహించాలని పంచాయతీ రాజ్ చట్టం స్పష్టం చేస్తోంది. దాదాపు అన్నిచోట్ల ఏర్పాటు చేశారు. నిర్వహణ ఖర్చులు ఉపాధి హామీ పథకం ద్వారా వెచ్చిస్తున్నారు. ఎండాకాలంలో మొక్కల పెంపకం చేపడుతున్నందున నర్సరీల్లో నీడ పట్టాలు విధిగా ఏర్పాటు చేస్తున్నారు. వాటి కొనుగోలుకు పంచాయతీ సాధారణ నిధులు వెచ్చిస్తున్నారు. ఇదే అదనుగా కొన్నిచోట్ల పాలకవర్గాలు ఏటా రెండు, మూడుసార్లు కొంటున్నట్లు కాకి లెక్కలు చూపుతున్నాయి. ఇదేమంటే గాలిదుమారానికి కొట్టుకెళ్లాయని కథలు అల్లుతున్నాయి.

పక్కా నిర్మాణాలే నయం

నర్సరీల్లో నీడ పట్టాలను కర్రలు, తీగలతో బిగిస్తారు. కూలీ ఖర్చులు కలిపి రూ.18వేల నుంచి రూ.19 వేల వరకు ఖర్చవుతుంది. ఆ తర్వాత ఏటా రెండు, మూడుసార్లు కేవలం పట్టా కొనుగోలు చేస్తున్నారు. ప్రతిసారి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు వెచ్చించారు. కొన్ని పంచాయతీలో నీడ పట్టాలకు ఏటా సగటున రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చుచేశారు. అయిదేళ్లలో నర్సరీల పేరుతో సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. ఆ నిధులతో ఏకంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టవచ్చు. ఇకనైనా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

షేడ్ నెట్‌ల నిధుల దుర్వినియోగం అంశాన్ని జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్‌ను వివరణ కోరగా.. నర్సరీల నిర్వహణ వ్యయాలను పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

# ఏళ్ల నిరీక్షణకు తెర!



కొత్తగూడెం : ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు విద్యాశాఖ పూనుకుంది. ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు తీపికబురు అందించింది. 2023 జనవరిలో ఉపాధ్యాయ బదిలీలకు షెడ్యూల్ జారీ చేసి ఫిబ్రవరి మొదటివారంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జీఓ జారీపై ఉపాధ్యాయ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు వెలువరించటంతో ఈ ప్రక్రియ మార్చిలో నిలిచిపోయింది. హైకోర్టు ఇటీవల రీషెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. తాజాగా రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది.

భర్తీ కానున్న రెగ్యులర్ ఎంఈఓ పోస్టులు

పాఠశాల విద్యాశాఖ సంచాలకురాలు శ్రీదేవసేన, అదనపు డైరెక్టర్ లింగయ్య టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించి బదిలీలు, ఉద్యోగోన్నతులపై డీఈఓలకు దిశానిర్దేశం చేశారు. ఎనిమిదేళ్లుగా ఉద్యోగోన్నతులు లేకపోవడంతో విద్యావ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్కూల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులుగా, ఎస్‌జీటీలు ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్)లుగా మారేందుకు ఏళ్లుగా ఎదురుచూస్తున్న పరిస్థితులకు తెరపడనుంది. అర్హత ఉన్నా చాలామంది ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా పాఠశాల నిర్వహణ గాడి తప్పుతోంది. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో 21 మండలాల్లో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలు ఉండగా.. మిగతా వారంతా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఒక్క రెగ్యులర్ ఎంఈఓ కూడా లేరు. ఒక్కొక్కరు మూడు నుంచి అయిదు మండలాల అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కొత్తగా రెగ్యులర్ ఎంఈఓలతో పాటు డిప్యూటీ డీఈఓ పోస్టులు భర్తీ కానున్నాయి.ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియకు సమాయత్తంగా ఉన్నాం. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం. సమస్యలు తలెత్తకుండా కలెక్టర్ పర్యవేక్షణలో సందేహాలను నివృత్తి చేసుకొని ముందుకెళ్తాం.సోమశేఖరశర్మ, డీఈఓ

# మందు బాబులు తెచ్చిన తంటా!

మహబూబాబాద్: ఓ సోడా సీసా తాగు నీరు సరఫరా చేసే పైపు లైన్‌లో ఇరుక్కొని ఆరు రోజులపాటు తాగునీటికి ఆటంకం కలిగించిన ఘటన గార్లలో చోటుచేసుకుంది. పంచాయతీ సిబ్బంది శనివారం తెలిపిన సమాచారం ప్రకారం.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఆరు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరాకు నోచుకోలేదు. దాదాపు 30 కుటుంబాల వారు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీళు రాని విషయమై సర్పంచి బన్సీలాల్, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లారు. వారు పంచాయతీ సిబ్బందితో పైపులైను మార్గాన్ని తవ్వించారు. తాగునీటి సరఫరా చేసే పైపు లైనులో సోడా సీసా ఇరుక్కొని కనిపించింది. ఆ సీసాను తొలగించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. ట్యాంకులో పడేయటంవలనే తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగినట్లు సర్పంచి, పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

# పేరుకే జాతీయం.. అంతా ఇరుకే!

మహబూబాబాద్: వరంగల్- ఖమ్మం 563వ జాతీయ రహదారిపై రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. అందుకనుగుణంగా విస్తరణ జరగడం లేదు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి విస్తరణ అవసరమని తెలిసినా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, పాలకులు ఆవైపు దృష్టి సారించడం లేదు. ఈ దారి గుండా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వరంగల్, కరీంనగర్ వైపు భారీ వాహనాలు వస్తుంటాయి. ఇటు నుంచి అటువైపు పెద్దసంఖ్యలో వెళ్తుంటాయి.నిత్యం వందల వాహనాలు, అనేక మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తుంటారు.

తొర్రూరు మండలం మాటేడు ప్రాంతంలోని 563వ జాతీయ రహదారిపై ఉన్న మూలమలుపు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు రేడియం స్టిక్కర్లతో కూడిన స్టాపర్లను రహదారి మధ్యలో ఏర్పాటు చేసినా ఫలితం ఉండడం లేదు.

ఇది మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో కాకతీయ కళాతోరణం. ఇది జిల్లాలో 563వ జాతీయ రహదారి ముగిసే ప్రాంతం. రెండు వరుసలతో ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 5 ప్రమాదాలు జరిగాయి.

సంక్షిప్తంగా..కరీంనగర్ నుంచి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి



మండలం వరకు ఇదే జాతీయ రహదారిని 68 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు కేంద్రం రూ.2,147 కోట్ల నిధులు కేటాయించింది. దీని మాదిరిగానే వరంగల్‌లోని ఆర్టీవో జంక్షన్ నుంచి మరిపెడ వరకు 83 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారిగా విస్తరించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

జగిత్యాల నుంచి కరీంనగర్, వరంగల్ మీదుగా ఖమ్మం జిల్లా వరకు 244.1 కి.మీ. కలిగిన రాష్ట్ర రహదారిని 2013-14లో 563వ జాతీయ రహదారిగా గుర్తించారు. దీన్ని ఉన్నతీకరించి పదేళ్లు అవుతుంది. రాష్ట్ర రహదారిగా ఉన్నప్పుడు నిర్మించిన రెండు వరుసలుగానే ఉంది. హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు మాత్రమే రహదారి విస్తరణ చేపడుతున్నారు. వరంగల్ నుంచి ఖమ్మం వైపు చేపట్టడం లేదు.ఈ దారిపై ప్రమాణం కత్తిమీద సాములా మారింది. గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయి. తొర్రూరు, దంతాలపల్లి, మరిపెడ, వర్ధన్నపేట, డీసీతండా ఐనవోలు క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇది దంతాలపల్లిలోని అంబేద్కర్ కూడలి నుంచి మరిపెడ వైపు వెళ్లేది. ఈ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత జులైలో ఇదే ప్రాంతంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఈ మండలంలోనే జనవరి నుంచి ఇప్పటి వరకు ఎనిమిది ప్రమాదాలు జరిగాయి. నలుగురు మృతి చెందగా 11 మంది గాయపడ్డారు.రహదారి మధ్యలో విభాగిని ఉండాలి

నెమ్మతి వెంకటపతి, దంతాలపల్లి

రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలి. మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలి. గ్రామాలున్న ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేపట్టాలి. అలా చేస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది.

# రూ.కోట్లు పెట్టి.. మూలకు చేర్చి..

నిజామాబాద్ : నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య వాహనాల నిర్వహణ గాడితప్పుతోంది. రూ.కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. భారీ వాహనాల షెడ్డు లేక ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పుపడుతున్న దుస్థితి. వినియోగించక కొన్ని.. చిన్నపాటి లోపం ఉన్నా బాగు చేయించకపోవడంతో మూలనపడి మరికొన్ని పాడవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇంజినీర్లు లేకే ఈ దుస్థితి.. నగరపాలక సంస్థకు 250 చెత్త సేకరణ వాహనాలు ఉన్నా మెకానిక్ ఇంజినీర్లు లేరు. దీంతో సివిల్ ఇంజినీర్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. వాహనాలు పాడయ్యాయని డ్రైవర్లు చెబితేనే వారికి తెలుస్తుంది. దీంతో ప్రతి నెల మరమ్మతుల కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు.

నివేదిక పంపించాం

సాజిద్ అలీ, ఎంహెచ్‌వో, నిజామాబాద్ నగరం

కొన్ని వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. ఏవేవి పాడయ్యాయో



వివరాలు ఇంజినీరింగ్ అధికారులకు నివేదిక పంపించాం. వారు బాగు చేయిస్తామన్నారు. త్వరగా చేయించాలని కోరాం.

రూ.30 లక్షలు వెచ్చించి చైన్‌తో నడిచే పొక్లెయిన్ కొన్నారు. దీనిని ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే డీసీఎం అవసరం దీంతో పక్కన పెట్టేశారు. ఆర్నెల్ల పాటు దీన్ని మూలకే ఉంచడంతో పాడైపోయింది. మరమ్మతులు చేయాలంటే రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

భారీ యంత్రాల పరిస్థితే ఇలా ఉంటే చెత్త సేకరించే ఆటోల నిర్వహణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 50-60 వరకు ఆటోలు కొనుగోలు చేయగా.. మరమ్మతులకు గురై మూలనపడ్డాయి.

నగరపాలక సంస్థ పరిధికి అనుగుణంగా కి.మీ.ల మేర భూగర్భ డ్రైనేజీ విస్తరించింది. కాల్వల్లో పూడిక తీసేందుకు సుమారు రూ.70 లక్షలు వెచ్చించి రెండేళ్ల క్రితం డ్రైనేజీ క్లీనింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. అప్పుడప్పుడు వీటిని వినియోగిస్తుండటంతో పైపులు పగిలి వాహనం నిరుపయోగంగా మారింది.

రహదారులు శుభ్రం చేయడానికి రూ.30 లక్షలతో చిన్న స్వీపింగ్ యంత్రం కొనుగోలు చేశారు. ఇది పాడవడంతో మరో మూడు కొనుగోలు చేశారు. కొత్తలో వీటిని ఉపయోగించారు. ఆ తర్వాత మరమ్మతులకు గురికావడంతో పక్కన పడేశారు. అవి పాడవడంతో ఆ స్థానంలో రూ.70 లక్షలు వెచ్చించి మరో భారీ యంత్రం కొనుగోలు చేశారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో అది కూడా మూలకుచేరింది. రూ.80 లక్షలతో మరొకటి తెచ్చి వినియోగిస్తున్నారు.

## కొండ రెడ్లకు మేలు జరిగేనా..?

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని కొండరెడ్లను ప్రభుత్వం ప్రిమిటివ్ వల్నెరబుల్ ట్రైబల్ గ్రూప్ (దుర్బల ఆదిమ గిరిజన తెగ)గా గుర్తిస్తూ వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 4 లక్షల మంది గిరిజనులు ఉండగా వీరిలో బాగా వెనుకబడిన తెగ ఇది. దీనికి ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఈ విభాగాన్ని పర్యవేక్షించేందుకు ఐటీడీఏలో ఒక విభాగం పనిచేస్తోంది. కొద్ది నెలల క్రితం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించి అక్కడి ఆదివాసీల జీవనశైలిపై ఆరా తీశారు. అధికారులు వైద్య శిబిరం నిర్వహించి మహిళల్లో క్యాన్సర్‌ను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. కేంద్ర బడ్జెట్ తొలి విడతపై ఆశ: ఆదిమ గిరిజనుల అభివృద్ధి మిషన్‌లో భాగంగా రూ.15 వేల కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్ర బడ్జెట్‌లో పొందుపర్చారు. ఇది దేశవ్యాప్తంగా రానున్న మూడేళ్లలో అమలుకానుంది. తెలంగాణలోని భద్రాచలం, మన్ననూరు, ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటీడీఏల పరిధిలో పీవీటీజీలు 570 ఆవాసాల్లో ఉన్నారు. గతంతో పోల్చితే బడ్జెట్ కేటాయింపు ఆశాజనకంగానే కనిపిస్తోంది. తొలి ఏడాది కనీసం రూ.100 కోట్లు కేటాయిస్తే సమగ్రాభివృద్ధికి ఆస్కారం ఉంటుందని కొండరెడ్లు ఆశిస్తున్నారు. ఈ




నిధులు రెండు మండలాల్లో మూడేళ్ల పాటు వెచ్చిస్తే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నిండే వీలుంది.

గడిచిన రెండేళ్లలో..మన్యంలోని కొండరెడ్ల సంక్షేమానికి గడిచిన రెండేళ్లలో రూ.5 కోట్ల పనులు చేపట్టారు. కొత్తగా రూ.6.5 లక్షల చొప్పున 291 పక్కా గృహాలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.18.91 కోట్లు అవసరం. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా పూసుకుంట గ్రామానికి రూ.29 లక్షలతో రక్షణ చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. అవసరమైన చోట్ల ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. అక్కడక్కడా డ్రైన్లు, కల్వర్టులు, చెక్‌డ్యాంలు, అంతర్గత దారులు నిర్మించాల్సి ఉంది. వెదురుతో బొమ్మలను తయారుచేసే కళాకారులను ప్రోత్సహించనున్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నారు. రైతులకు పోడుపై హక్కు కల్పించి రైతుబంధు పథకం వర్తింపజేసేందుకు యత్నిస్తున్నారు. మన్యం ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాలయాలు ఆదర్శంగా మారుతున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నాం. అభివృద్ధి పనులపై పీఓ గౌతమ్, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సురేశ్‌బాబు, కొండరెడ్ల అధికారి

## అద్దె భవనాలు.. అన్నీ సమస్యలు!

కరీంనగర్ : గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్)లోని మహాత్మ జ్యోతిబా పులే బీసీ బాలికల గురుకుల పాఠశాల ఇది. నెలకు రూ.1.30 లక్షల అద్దెతో ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల భవనం పైనుంచి పదో తరగతి విద్యార్థిని దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గతంలో సిబ్బంది ఒకరు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. 552 మంది పాఠశాల, ఇంటర్ విద్యార్థులు అరకొర వసతుల మధ్య చదువుకుంటున్నారు. బడి పక్కనే మురుగు నిల్వతో దుర్వాసన వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని భవన యజమానికి పలుసార్లు చెప్పినట్లు ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు.

జిల్లాలో ఈ రెండు గురుకుల పాఠశాలలే కాదు అన్ని చాలా గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎల్ఎండీలోని బాలికల గురుకుల పాఠశాలకు మాత్రమే సొంత భవనం ఉంది. మిగతా అన్ని చోట్ల అద్దె భవనాల్లోనే అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని వీటిని ఏర్పాటు చేసిన ప్రభుత్వం వసతులు కల్పించడంలో శ్రద్ధ చూపించడం లేదు. ప్రభుత్వం మరోసారి అదనంగా జిల్లాకు ఒక గురుకులం చొప్పున విద్యాసంవత్సరం మధ్యలో మంజూరు చేసింది.

కళాశాలలుగా అప్‌గ్రేడ్.. పెరగని వసతులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బీసీ బాలురు, 13 బాలికల గురుకులాలు నిర్వహిస్తున్నారు. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక తరగతికి 40 మంది విద్యార్థులు ఉండగా రెండు సెక్షన్లు కొనసాగుతున్నాయి. ఇలా ఆరు తరగతులకు 12 గదులు అవసరం. ల్యాబ్‌ల నిర్వహణ, స్టాఫ్ రూం, కార్యాలయ గది, వంటశాల, డైనింగు హాల్ వీటన్నింటికీ 6 గదులు అవసరం. వసతుల్లేక ఇబ్బందులు పడుతుండగా జిల్లాలోని 13 పాఠశాలల్లో ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. దీంతో సమస్యలు రెట్టింపయ్యాయి. తరగతి గదులతోపాటు ల్యాబ్‌లు, కార్యాలయ గది, స్టాఫ్‌రూం అదనంగా కావాల్సి ఉంది. స్నానాల గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల్లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2019లో ఏర్పాటు చేసిన వీటికి ఫర్నీచర్ ఇవ్వలేదు.

ఫర్నిచర్ లేక ఇబ్బందులు. జిల్లాలో 19 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉండగా వీటిలో 9 బాలికలు, 10 బాలుర పాఠశాలలు నడుస్తున్నాయి. దాదాపు 58 వేల మంది చదువుకుంటున్నారు. ప్రైవేటు భవనాల్లోనే బడులు నిర్వహిస్తుండగా, వాటి సామర్థ్యం బట్టి ఒక్కో దానికి రూ.2.20 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నారు. అన్నింటిల్లోనూ ఇంటర్ విద్యకు అప్‌గ్రేడ్ చేయగా ఎక్కడా విద్యార్థులకు వసతులు సమకూరలేదు. పూర్తి స్థాయిలో ఫర్నీచర్ కేటాయించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ ఒక పాఠశాలకూ సొంత భవనం లేకపోవడంతో ఎక్కడా మైదానం అనువుగా లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ఈ చిత్రంలో గంగాధరలోని జ్యోతిబా పులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకుంటున్నారు. సొంత భవనం లేకపోవడంతో నెలకు దాదాపు రూ.2 లక్షల అద్దె దాంట్లో నిర్వహిస్తున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 375 మంది ఉండగా ఇంకా కొన్ని సీట్లు మిగులు ఉన్నాయి. తరగతి గదుల్లో డెస్క్ బల్లలు, బెంచీలు లేక నేలపై చదువు భారంగా సాగుతోంది. ఇక రాత్రిపూట విద్యార్థులు నిద్రించడానికి పడకలు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. సరిపడా స్నానాల గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

# ప్రకృతి వనం.. ఆహ్లాదం కనం



భద్రాచలం : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, పచ్చదనాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాల్లో పల్లె ప్రకృతి వనాలు ఒకటి. నాలుగేళ్లుగా వీటి కోసం రూ.కోట్ల నిధులు వెచ్చిస్తోంది. ఉపాధి పథకం ద్వారా వనాల్లో మొక్కలు నాటించింది. ఆ తరువాత నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించింది. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తుండటంతో చాలాచోట్ల ప్రకృతి వనాలు ప్రభను కోల్పోతున్నాయి.

వాడిపోతున్న వనాలు

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని 479 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటికి తోడు బృహత్ ప్రకతి వనాలు అందుబాటులోకి తెచ్చారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనాల్లో మాత్రం 1500 నుంచి 2వేల వరకు మొక్కలు నాటారు. ఒక్కో వనం సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉండాలని చెప్పినా, స్థలాభావం వల్ల 10కుంటల విస్తీర్ణం నుంచి ఎకరం వరకు ఏర్పాటు చేశారు. ఆరంభం నాటి శ్రద్ధ ఆ తరువాత చూపకపోవడం వల్ల కొన్నిచోట్ల మొక్కలు ఎదుగూబొదుగు లేకుండా పోయాయి. మరికొన్ని గ్రామాల్లో పచ్చదనం, ఆహ్లాదం పంచుతున్నాయి. చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి నాటాల్సి ఉన్నా పట్టించుకోనిచోట్ల పలుచగా కనిపిస్తున్నాయి.

వేసవిలో సంరక్షణ ఎలా?

ప్రకృతి వనాల్లో మొక్కలు ఎదగడానికి సరిపడా నీటి వసతి కల్పించాల్సి ఉంది. చాలాచోట్ల నీరు లేకపోవడంతో పెరగడం లేదు. వేసవిలో వీటి పెంపకంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. పంచాయతీ ట్యాంకుల ద్వారా నీరందిస్తున్నా ఈ ప్రక్రియ సక్రమంగా లేదు. పంచాయతీ సిబ్బందిపై పర్యవేక్షణ ఉండటం లేదు. కొన్ని మొక్కలకు నీరు పట్టి, మరికొన్నింటిని వదిలేస్తున్నారు. ముందు భాగంలో పచ్చదనం కనిపిస్తుండగా, వెనుక భాగంలో ఎండిపోయిన మొక్కలు దర్శనమిస్తున్నాయి. వనాల్లో ఎండిన కొమ్మలు వేరు చేయడం లేదు. కాలిబాటల్లో చెత్తాచెదారం దర్శనమిస్తోంది.

విహారం ఎన్నడో..జిల్లాలో ప్రకృతి వనాల్లో సుమారు 12లక్షల మొక్కలు నాటారు. నిర్వహణ తీరు బాగా ఉన్నచోట కనువిందు చేస్తున్నాయి. మొక్కలు ఎదిగి మానులను తలపిస్తున్నాయి. కానీ వీటిల్లోకి జనాలు ప్రవేశించి సేదతీరే అవకాశం లేకుండా పోయింది. పంచాయతీ ఆధ్వర్యంలో సందర్శకుల కోసం బల్లలు, నడక దారులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి కనిపించడం లేదు. పాలకవర్గాలు ప్రకృతి వనాలకు గేట్లు ఏర్పాటుచేసి తాళాలు వేసి ఉంచుతున్నారు.

జూలూరుపాడు మండలంలో 24 ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అయిదింటి ఆనవాళ్లు కనిపించడం లేదు. ఇంకోపక్క గుండ్లరేవు, పాపకొల్లు, జూలూరుపాడులోని మెగా ప్రకృతి వనం, పడమటినర్సాపురంలోని ప్రకృతి వనాలు కనువిందు చేస్తున్నాయి. పినపాక మండలంలోని సీతారంపురంలో మొక్కలకు ట్యాంకు ద్వారా నీరు పోస్తున్నా సక్రమంగా అందడం లేదు. మరోవైపు ఈ మండలంలో నాలుగు మెగా వనాలున్నాయి. వీటిలో పాతరెడ్డిపాలెంలో 10వేల మొక్కలకు 2, 3 వేలు మాత్రమే కనిపిస్తున్నాయి.

చంద్రుగొండ మండలంలో 14 పల్లె ప్రకృతి వనాలు ఉండగా, తుంగారం, రేపల్లెవాడలో అధ్వానంగా ఉన్నాయి. అనేకచోట్ల బల్లలు కూడా ఏర్పాటు చేయలేదు.

బూర్గంపాడు మండలంలోని అనేక వనాల్లో ఎండు కొమ్మల్ని కత్తిరించడం లేదు. ట్రాక్‌లు ఉన్నా ఎండిన ఆకులు, కొమ్మలతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

ఆళ్లపల్లి మండలం అడవి రామవరం ప్రకృతి వనంలో మొక్కలకు నీటి సౌకర్యం లేదు. ఆళ్లపల్లిలో మెగా ప్రకృతి వనంలో నీరందించేందుకు జనరేటర్‌ను ఏర్పాటు చేశారు.

# మొక్కే కదా అని వదిలేస్తే...



వైరా : ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం తల్లాడ మండల కేంద్రంలోది. రెండెకరాల విస్తీర్ణంలో తల్లాడ, నారాయణపురం, మంగాపురం గ్రామ పంచాయతీలకు చెందిన పల్లె ప్రకృతి వనాలను ఒకేచోట ఏర్పాటుచేశారు. రెండు బోర్లు వేసినా పడలేదు. సమీపంలోని చెరువు నుంచి మోటర్లతో నీటినందిస్తున్నారు. సరైన నిర్వహణ లేక మొక్కలు ఎండుతున్నాయి. వనం కళ తప్పింది. ట్రాకులు దెబ్బతిన్నాయి. ఈ చిత్రంలో కనిపిస్తున్న పల్లె ప్రకృతి వనం కొణిజర్ల మండలం సింగరాయపాలెంలోనిది. అందమైన పూల మొక్కలు, వాకింగ్ ట్రాక్, ఇతర సదుపాయాలున్నాయి. ఈ వనాన్ని గతంలో మంత్రి కేటీఆర్ సైతం అభినందించారు. ప్రతిరోజు మొక్కలకు నీరు అందించడం, నిర్వహణను పర్యవేక్షించడంతో అందంగా ఉండి స్థానికులకు ఆహ్లాదకరంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు జిల్లాలో కొన్నిచోట్ల ప్రభను కోల్పోతున్నాయి. చేతికొచ్చిన మొక్కలు ఎండుతున్నాయి. నిర్వహణ తీరు బాగున్నచోట్ల ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. నిర్వహణకు గత రెండేళ్ల నుంచి నిధులు రాకపోవటం సమస్యగా మారింది. వేసవి మండుటెండల నేపథ్యంలో మొక్కలు ఎండకుండా నియంత్రించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సదుద్దేశం.. ఎంతో వ్యయం

పల్లె ప్రకృతి వనం ఏర్పాటుకు స్థల లభ్యత లేకున్నా కొన్నిచోట్ల దాతల ఔదార్యంతో సేకరించి అందుబాటులోకి తెచ్చారు. అరెకరం, ఎకరం, కొన్నిచోట్ల రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఎకరం విస్తీర్ణంలో ఉంటే నాలుగు వేలు, అరెకరం ఉంటే రెండు వేల చొప్పున మొక్కలు నాటారు. మెజార్టీ పంచాయతీలు కడియం నుంచి అధిక మొత్తం వెచ్చించి మొక్కలు కొనుగోలు చేశారు. చిన్న పంచాయతీలు సైతం ఇందుకోసం రూ.2 లక్షల కేటాయించారు. కొన్నిచోట్ల ప్రభుత్వ నర్సరీల్లో వాటినే ఏర్పాటు చేశారు. మొత్తంగా మొక్కలు, ఫెన్సింగ్, మట్టి, ట్రాకింగ్ వంటి సౌకర్యాలకు ఒక్కో వనానికి రూ.5–8 లక్షల వరకు ఖర్చయింది.

ఇదీ సమస్య..

మొదటి రెండేళ్ల కాలంలో నిర్వహణకు ఉపాధి నిధులు కేటాయించారు. ఫెన్సింగ్, గేట్లు, ఇతర బోర్లకు నిధులు ఈజీఎస్ నుంచి వెచ్చించారు. వాచర్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెలా రూ.6వేల వరకు వేతనం ఇచ్చేవారు. నీళ్లు పోసేందుకు, గడ్డి తొలగింపునకు రూ.7–8 వేలు ప్రతి నెలా ఉపాధి పథకం నుంచి అందించేవారు. గత ఏప్రిల్ నుంచి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలకు పూర్తిస్థాయిలో అప్పగించారు. పంచాయతీలే వేతనాలు చెల్లిస్తున్నాయి. నిధుల లేమితో బాధపడుతున్న వాటికి ఇదో భారంగా మారింది. ట్రెజరీ వద్దనే నెలల తరబడి నిధులు మూలుగుతుండటంతో సవాల్‌గా మారింది. మొత్తంగా నిధుల లేమి, నిర్వహణలో నిర్లిప్తత, నీటి కొరత వంటి సమస్యలతో కొన్ని వనాల్లో పచ్చదనం క్రమేపీ కనుమరుగవుతుంది. ఇప్పటికే ఎండలు మండుతున్న నేపథ్యంలో మొక్కలు ఎండిపోతున్నాయి.

చేయాల్సిందిలా.. ప్రతి పల్లె ప్రకృతి వనంలో వాచర్ లేదా సిబ్బంది క్రమం తప్పకుండా నీరు అందించేలా చూడాలి. గడ్డిని ఎప్పటికప్పుడు తొలగించాలి. అవసరమైతే మళ్లీ మట్టిని ఏర్పాటు చేయాలి. చాలాచోట్ల బోర్లు వేసవిలో సరిపడా నీరు పోయడం లేదు. పంచాయతీ ట్యాంకర్ ద్వారా అందించాలి. వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ దెబ్బతిన్న చోట గేదెలు, మేకలు వచ్చే పరిస్థితులను నియంత్రించాలి.

## కారును అడ్డగించి రూ.21 లక్షలు చోరీ

ఖమ్మం : గుర్తుతెలియని వ్యక్తులు ఓ చిట్‌ఫండ్స్ ఛైర్మన్ కారును అడ్డగించి రూ.21లక్షలు నగదు, 4తులాల బంగారం చోరీ చేసిన సంఘటన గ్రామీణ మండల పరిధిలోని మద్దులపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండలో ఓ చిట్‌ఫండ్స్ ఛైర్మన్‌గా ఉన్న శ్రీనివాసరెడ్డి ఖమ్మం గ్రామీణ మండలంలోని టీఎన్జీవోస్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. రాత్రి తన కుమారుడు, ముగ్గురు స్నేహితులతో కలిసి మొత్తం ఐదుగురు కారులో హైదరాబాద్ బయలుదేరారు. మద్దులపల్లి దాటగానే ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి కారును అడ్డగించి ఘర్షణపడ్డారు. ఓ కారులో మరో ఆరుగురు వ్యక్తులు వచ్చి శ్రీనివాసరెడ్డి వారి స్నేహితులు అందరిని బెదిరించి వారి వద్ద రూ.21,57,700 నగదుతో ఉన్న బ్యాగు, నాలుగు తులాల బంగారం చోరీ చేసి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసునమోదు చేశారు. విడాకులు ఇవ్వకుంటే నగ్నచిత్రాలు నెట్‌లో పెడతా.. ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతికి భర్త వేధింపులు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లు కాపురం చేసిన తర్వాత ఇప్పుడు విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. లేదంటే తన నగ్న చిత్రాలను అంతర్జాలంలో పెడతానని భర్త బెదిరిస్తున్నాడని ఓ వివాహిత నేలకొండపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం గ్రామానికి చెందిన ఉన్నం సంతోష్, మండలంలోని ఆపై చాటింగ్ చేస్తూ ప్రేమలో పడ్డారు.

## పనికి వెళ్లకుంటే ఉపాధి రద్దు

సిరిసిల్ల : నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)లో కేంద్రం పలు మార్పులు చేపట్టింది. ఈ పథకం ప్రవేశపెట్టి ఫిబ్రవరి 2 నాటికి 17 ఏళ్లు పూర్తయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న ఈ పథకం విస్తృతి తగ్గుతోంది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్లో కోత విధించింది. అది మరవక ముందే పనికి వెళ్లని కూలీలను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. దీని ప్రభావం ఉమ్మడి జిల్లాలో 4.15 లక్షల మంది కూలీలపై చూపనుంది.

కేంద్రం ఉపాధి హామీకి నిధుల కేటాయింపు తగ్గింపు ప్రభావం రాష్ట్రం, జిల్లాలపైన చూపనుంది. ఇప్పటికే జాబితాలో నమోదు చేసుకున్న కూలీలకు సరిపడా పనులు దొరకడం లేదు. కేంద్రం తాజా నిర్ణయంతో మరింత మంది ఉపాధి కోల్పోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,215 గ్రామాల్లో ఇది అమలవుతోంది. 2019లో పురపాలికల విస్తరణతో చాలా గ్రామాలు పట్టణాల్లో విలీనమయ్యాయి. ఇక్కడి వారు చాలా కాలంగా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. వీరి వినతులు బుట్టదాఖలయ్యాయి. వచ్చే నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,531 కుటుంబాలు మాత్రమే వంద రోజులు పూర్తి చేసుకున్నాయి. దీనిలో అత్యధికంగా కరీంనగర్ జిల్లాలోనే ఉన్నాయి.

అక్రమాలకు తావివ్వకూడదని...పని చేసే వారికే ఉపాధి హామీ పథకం



అమలు చేస్తూ.. అక్రమాలకు తావివ్వ కూడదని కేంద్రం భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 9.37 లక్షల మంది కూలీలుండగా వారిలో 5.21 లక్షల మంది మాత్రమే తరచూ పనులకు వెళ్తున్నారు. మిగతా 4.15 లక్షల మంది కూలీలు (ఇనాక్టివ్) పనికి రావడం లేదని గుర్తించారు. వీరిలో జాబ్‌కార్డులు తీసుకున్న రోజు నుంచి ఇప్పటి వరకూ ఒక్క రోజు కూడా పని చేయని వారిని పరిగణనలోకి తీసుకున్నారు. కరోనా విజృంభణతో ఇతర దేశాలు, నగరాలు, పట్టణాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన వారు గ్రామాల బాట పట్టారు. వీరిలో ప్రైవేటు సంస్థల్లో పని చేసే వారితోపాటు చదువుకునే యువత ఉన్నారు. కూలీ కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డుతోపాటు పని కల్పించారు. 2020–21లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 శాతానికి పైగా కొత్త వారు చేరారు. ఆ సంవత్సరం రోజుకు గరిష్ఠంగా రూ.140 నుంచి రూ.160 కూలి గిట్టుబాటైంది. కరోనా తగ్గడంతో తిరిగి పట్టణాలకు వెళ్లారు. ఉపాధి హామీ పథకంలో పశువుల పాకలు, కల్లాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలకు జాబ్‌కార్డులు తప్పనిసరి చేశారు. ఆయా పనులు పూర్తికావడంతో వాటిలోనూ చాలా వరకు ఉపయోగంలో లేని కార్డులున్నాయి. వీరిలో కొందరికి రెండేసి జాబ్‌కార్డులున్నాయి. పనులకు వెళ్లకుండానే స్థానిక క్షేత్రసహాయకులు, కార్యదర్శుల సాయంతో హాజరు నమోదు చేసుకుంటూ కొందరు కూలి పొందుతున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి కూలీ జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేశారు. ఆధార్‌లోని పేర్లు, జాబ్‌కార్డులోని పేర్లలో కొన్నింటికి తేడాలు ఉన్నాయి. వీటిని సరిచేసేందుకు కొంత సమయం పడుతుంది. ఈ ప్రక్రియ పూర్తయితే అర్హుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## రెండు మండలాల వారధికి మోక్షమెన్నడో?

గోదావరిఖని : గ్రామీణ రవాణా వ్యవస్థపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వంతెనలు, రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడం లేదు. రెండు మండలాల వారధితోపాటు తారు రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించి ఏళ్లు కావస్తున్నా నిధులు మంజూరు కావడం లేదు. దీంతో రాకపోకలకు వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి–చందుర్తి మండలం ఎన్గల్ మధ్య రెండు మండలాల వారధితోపాటు తారు రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు కోసం పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. సుమారు 5 కిలో మీటర్ల మేర మట్టి రోడ్డు ఉండటంతో వాహనదారులు, రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు మరింత అధ్వానంగా మారటంతో వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు రాకపోకలు నిలిచిపోవటం పరిపాటిగా మారింది. వాహనదారులు, రైతులు వ్యయ, ప్రయాసలకు లోనవుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరవాత శీతాకాలం, వేసవిలో మట్టి రోడ్డులో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంటుంది. రెండు మండలాలకు మధ్యలో ఉన్న నక్కవాగు ఒర్రెలో తరచూ నీరు పారటంతో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు కూరుకుపోయి అవస్థలు పడుతున్నారు. సుమారు 2 వేల ఎకరాల్లో పండించిన పంట ఉత్పత్తులను ఇళ్లకు తరలించటానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. గుంతలమయంగా మారిన మట్టి రోడ్డును రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేయించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రవాణా కష్టాలు తప్పటం లేదు

మామిడిపల్లి–ఎన్గల్ మధ్య తారు రోడ్డు నిర్మాణానికి ఎదురుచూపులు తప్పటం లేదు. రోడ్డు సౌకర్యం లేక చందుర్తి మండల కేంద్రానికి వెళ్లటానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మట్టి రోడ్డు గుంతలమయంగా మారటంతో పాటు నక్కవాగు తరచూ పారటంతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వంతెనతోపాటు రోడ్డు నిర్మాణం చేపడితే సౌకర్యంగా ఉంటుంది. ముదాం రాములు, రైతు, మామిడిపల్లి

రూ.3 కోట్లతో ప్రతిపాదనలు

తారు రోడ్డు నిర్మాణంతో పాటు నక్కవాగు (ఒర్రె)పై వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు ప్రభుత్వ పరిశీలనలో ఉంది. నిధులు రాగానే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. తారు రోడ్డు నిర్మాణం చేపడితే రెండు మండలాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది.
టి.భూమేశ్వర్, డీఈ పీఆర్, వేములవాడ మామిడిపల్లి–ఎన్గల్ మధ్యలో నక్కవాగు వద్ద దుస్థితి



# దేశం పేరు మారుస్తున్నారా?

## దేశం పేరు ఇక 'భారత్'? తీర్మానం చేసే యోచనలో కేంద్రం..!

దిల్లీ: మన దేశం పేరును ఆంగ్లంలోనూ 'ఇండియా' నుంచి 'భారత్'గా మార్చనున్నారా? రాజ్యాంగాన్ని సవరించి తీర్మానం చేయనున్నారా? ప్రస్తుత రాజకీయ పరిణామాలతో ఇప్పుడు ఈ ఊహాగానాలు జోరందుకున్నాయి. అసలేం జరిగిందంటే.. భారత్ అధ్యక్షతన ఈ వారాంతంలో జీ-20 శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల అధినేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సెప్టెంబరు 9వ తేదీన ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఇందుకోసం రాష్ట్రపతి భవన్ నుంచి ఇప్పటికే అతిథులకు ఆహ్వానం అందింది. అయితే, ఈ ఆహ్వానంపై President of India అని బదులుగా President of Bharat అని ముద్రించి ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. తమకు అందిన ఆహ్వానంలో ఈ మార్పును గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ట్విటర్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. "జీ-20 విందు కోసం President of India బదులుగా President of Bharat అనే పేరుతో రాష్ట్రపతి భవన్ ఆహ్వానం పంపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 1లో ఇంతకుముందు 'ఇండియా: అది భారత్' అని ఉంటుంది. కానీ ఇప్పుడు మోదీ సర్కార్ వల్ల దీన్ని.. 'భారత్, అది ఇండియా, రాష్ట్రాల సమాఖ్య' అని చదవాలి. ఇది రాష్ట్రాల సమాఖ్యపైనా జరుగుతోన్న దాడి" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా కేంద్రంపై ధ్వజమెత్తారు.

**ప్రత్యేక సమావేశాల్లోనే పేరు మార్పు..? :** అటు జీ-20 సదస్సు కోసం రూపొందించిన బుక్‌లెట్‌లోనూ దేశం పేరు 'భారత్' అని పేర్కొన్నారు. 'భారత్, మదర్ ఆఫ్ డెమోక్రసీ' అని అందులో రాశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశం పేరు మార్పుపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆంగ్లంలోనూ 'ఇండియా' నుంచి 'భారత్'గా పేరు మారుస్తూ ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రత్యేక తీర్మానం తీసుకురానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నెల 18 నుంచి 22 మధ్య ఐదు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ ప్రతిపాదనలు తీసుకురానున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, మంగళవారం ఉదయం అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా దీనిపై ఓ ట్వీట్ చేశారు.

"రిపబ్లిక్ ఆఫ్ భారత్ - మన నాగరికత అమృత్‌కాల్ వైపు వేగంగా అడుగులు వేస్తుండటం గర్వంగా ఉంది" అని రాసుకొచ్చారు. దేశం పేరు మార్పుపై వస్తున్న ఊహాగానాలకు ఈ ట్వీట్ మరింత బలం చేకూర్చినట్లయింది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కేంద్రంలోని అధికార 'జాతీయ ప్రజాతంత్ర కూటమి' (ఎన్డీయే)పై పోరుకు జట్టు కట్టిన విపక్షాలు తమ కూటమి పేరును ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్ (ఐఎన్‌డీఐఏ- ఇండియా)గా ప్రకటించిన విషయం తెలిసిందే. దేశం పేరు మీదుగా తమ కూటమికి పేరు పెట్టుకోవడంపై అప్పట్లో భాజపా నేతల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత దేశం పేరును 'భారత్' అని మార్చాలంటూ డిమాండ్లు కూడా వినిపించాయి. ఈ క్రమంలోనే పేరు మార్పుపై ఊహాగానాలు రావడంతో దేశ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.



# చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా...

## జీ-20 సదస్సు .. దిల్లీలో కట్టుదిట్టమైన భద్రత..!

**దేశ రాజధాని దిల్లీలో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జరగనున్న జీ-20 శిఖరాగ్ర సదస్సు కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచదేశాధినేతల మధ్య జరిగే ఈ భేటీ వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. రక్షణ నిమిత్తం భద్రతా బలగాలతో పాటు సరికొత్త సాంకేతికతలను మోహరించారు. చీమ చిటుకుమన్నా గుర్తించేలా బందోబస్తు ఏర్పాటు చేశారు. గగనతలాన్నిశత్రు దుర్భేద్యంగా మార్చారు.**

# రాష్ట్రంలో పవర్ హాలిడే లేదు - పరిశ్రమలకు పరిమితుల తొలగింపు



అమరావతి: రాష్ట్రంలో పవర్ హాలిడే లేదని, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాపై ఎలాంటి పరిమితులు అమలు చేయడం లేదని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రకటించాయి. ఈమేరకు ప్రకటన విడుదల చేశాయి. విద్యుత్ డిమాండుకు అనుగుణంగా సరఫరా పరిస్థితి మెరుగుపడినందున పరిశ్రమలకు సరఫరాలో పరిమితులు ఎత్తివేయాలని నిర్ణయించినట్లు తెలిపాయి. రాష్ట్రంలో ఆదివారం అన్నిరంగాలకు ఎలాంటి కోతలు, పరిమితులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు వివరించాయి. రాష్ట్రంలో మొత్తం 206.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా సరఫరాలో ఎలాంటి అంతరాయాలుగానీ, లోడ్ షెడ్డింగ్ లేదు. సెప్టెంబర్ 1 వ తేదీన రాష్ట్రంలో నెలకొన్న గ్రిడ్ డిమాండ్ - సరఫరా పరిస్థితులను బట్టి పారిశ్రామిక రంగానికి కొద్ది మేర విద్యుత్ సరఫరా తగ్గించి, ప్రాధాన్యతా రంగాలైన గృహ, వ్యవసాయ రంగాలను ప్రాధాన్యం ఇచ్చి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేశాయి. వ్యవసాయ, గృహ వినియోగరంగాలను పాధాన్యతా రంగాలుగా పరిగణించి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ సంస్థలు భావించాయి. ఇందులో భాగంగానే డిమాండు ఎక్కువగా ఉన్నప్పుడు పరిశ్రమలకు కొంతమేరకు సరఫరా తగ్గించి వ్యవసాయ, గృహ వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తామని గౌరవ కమిషన్ కు అభ్యర్ధన పంపించాం. విద్యుత్ పంపిణీ సంస్థల అభ్యర్ధన మేరకు గౌరవ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి 2023 సెప్టెంబర్ 09న ఈనెల 5 వ తేదీ నుంచి రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి స్వల్పంగా విద్యుత్ వాడకంలో పరిమితులు విధించవచ్చని కమిషన్ అనుమతించింది.

# టీచర్లు నిర్వర్తిస్తున్న పాత్ర ప్రశంసనీయం

## టీచర్లందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.. - సర్వేపల్లికి సీఎం వైయస్ జగన్ నివాళి

తాడేపల్లి: భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చిదిద్దడంలో టీచర్లు నిర్వర్తిస్తున్న పాత్ర ప్రశంసనీయమైనదని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ(సెప్టెంబర్ 5న) జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. ఉపాధ్యాయులందరికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు లండన్ పర్యటనలో ఉన్న ఆయన తన ట్విటర్(ఎక్స్) ద్వారా టీచర్స్ డే సందేశం ఉంచారు.

"భవిష్యత్ తరాలను సమున్నతంగా తీర్చిదిద్దడంలో టీచర్లు నిర్వర్తిస్తున్న పాత్ర ప్రశంసనీయమైనది.

విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను అమలు చేస్తూ.. ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేలా మన పేదింటి పిల్లలను సుశిక్షితులుగా తయారు చేయడంలో.. ధృడసంకల్పంతో కృషి చేస్తున్న టీచర్లందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నా



శుభాకాంక్షలు. ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా నివాళులు అని సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ట్వీట్ చేశారు.

# కరెంట్ కోతలపై ప్రభుత్వానివి గందరగోళ ప్రకటనలు



విజయవాడ: ఏపీలో కరెంట్ కోతలపై ప్రభుత్వం గందరగోళ ప్రకటనలు చేస్తోందని ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురంధరేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కోతలు ఉంటాయని ఒకసారి, ఉండవని మరోసారి ప్రకటన చేశారన్నారు. అంటే విద్యుత్ విధానంపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. గ్రామాల్లో తొమ్మిది గంటల విద్యుత్ అని జగన్ హామీ ఇచ్చారని.. ఇప్పుడు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. ప్రజలు రోడ్ల పైకి వచ్చి విద్యుత్ కార్యాలయాలను ముట్టడించే పరిస్థితి ఏర్పడిందన్నారు. 240 మిలియన్ యూనిట్లు ఒక రోజుకు అవసరమని.. 198 మిలియన్ యూనిట్లు మాత్రమే మనకు అందుతోందన్నారు. 40మిలియన్ యూనిట్లు కొరత ఉందని అన్నారు. విద్యుత్ కొనుగోళ్లులో పీపీఎలను జగన్ సీఎం అవగానే రద్దు చేశారన్నారు. జగన్ ప్రభుత్వం ప్రకటనలతో పెట్టుబడిదారులు రాని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రైతులు, గ్రామీణ ప్రజలు కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నారని.. వారికి ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. విద్యుత్ అవసరాలు, వినియోగంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరులోనే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

వచ్చే వేసవి నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆందోళన చెందారు. విద్యుత్ కోతలు నివారించాల్సిన సీఎం విదేశీ పర్యటనకు వెళ్లిపోయారని.. ఈ అంశాలపై రాష్ట్ర ప్రజలకు ఎవరు సమాధానం చెబుతారని పురందేశ్వరి ప్రశ్నించారు.

# సనాతన ధర్మంపై టీటీడీ పాలకమండలిలో కీలక నిర్ణయం



తిరుమల: టీటీడీ పాలకమండలి మంగళవారం ఉదయం సమావేశమైంది. టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సనాతన ధర్మాన్ని విస్తృత్తంగా వ్యాప్తి చెయ్యాలని నిర్ణయించినట్లు టీటీడీ ఛైర్మన్ వెల్లడించారు. చిన్నతనం నుంచే భక్తి భావాని పెంచేలా తిరుమలలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గోవింద కోటి రాసిన 25 సంవత్సరాల లోపల యువతి, యువకుల కుటుంబానికి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తామని చెప్పారు. 10 లక్షల 1116 సార్లు గోవింద కోటి రాసిన ఓ భక్తుడికి బ్రేక్ దర్శనం కల్పిస్తామన్నారు. విద్యార్థిని, విద్యార్థుల్లో ఆధ్యాత్మికత పెంచేలా రాష్ట్రంలో ఎల్కేజీ నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు 20 పేజీల భగవద్గీత పుస్తకాన్ని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని.. భక్తులకు ఏ ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తామని టీటీడీ ఛైర్మన్ తెలిపారు. 18వ తేదీ ప్రభుత్వం తరుపున సీఎం జగన్ స్వామి వారికి పట్టు వస్త్రాలని సమర్పిస్తారన్నారు. ఈ సందర్భంగా 2024 డైరీ, క్యాలెండరులని సీఎం ఆవిష్కరిస్తారని తెలిపారు. అలాగే సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని టీటీడీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.

**టీటీడీ పాలకమండలి నిర్ణయాలు ఇవే..** రూ.1.65 కోట్లతో ముంబాయిలో మరో ఆలయ నిర్మాణం. రూ.5.35 కోట్లతో సమాచార కేంద్రం నిర్మాణం. పాలకమండలి సభ్యులే దీన్ని నిర్మిస్తారు. రూ.2 కోట్లతో మూలస్థాన ఎల్లమ్మ ఆలయాన్ని ఆధునీకరణ. రూ.49.5 కోట్లతో టీటీడీ క్వార్టర్స్ ఆధునీకరణ. 413 మంది అర్చకులు, పరిచారకులు, పోటు సిబ్బంది పోస్టులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదన. పద్మావతి అస్పత్రిలో 300 మంది సిబ్బంది నియామకానికి ఆమోదం. రూ.2.46 కోట్లతో టీటీడీ అస్పత్రుల్లో మందుల కొనుగోలుకు ఆమోదం. రూ.47 వేద అధ్యాపకుల పోస్టులు మంజూరుకీ ఆమోదం. రూ.33 కోట్లతో టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల్లో సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయింపు. తిరుపతి రోడ్ల మర్మతులకు రూ.4 కోట్లు కేటాయింపు.. రూ.600కోట్ల రూపాయలతో గోవిందరాజ సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపాదం భవనాలను నిర్మాణం.

# ఎస్సై పోస్టుల భర్తీపై డీజీపీకి లోకేశ్ లేఖ

అమరావతి: ఎస్ఐ పోస్టుల భర్తీకి సంబంధించిన మెయిన్ పరీక్షలకు కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలని డీజీపీకి టీడీపీ యువనేత నారా లోకేశ్ లేఖ రాశారు. ఏటా 6,500 ఉద్యోగాల కల్పన హామీని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం, గత 4 ఏళ్లుగా నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటం బాధాకరమన్నారు. ఎన్నికల ఏడాది కాబట్టి అకస్మాత్తుగా నిద్ర మేల్కొని ఎస్సై పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని మండిపడ్డారు. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మార్చి నెలలో నిర్వహించాల్సిన ఫిజికల్ టెస్ట్‌లను అసంబద్ధంగా ఆగస్టు చివరి వారంలో ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించారన్నారు. సెప్టెంబర్ 24న దేహదారుఢ్య పరీక్షలు ముగుస్తుండగా, మెయిన్ పరీక్షలు అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మెయిన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఇంత తక్కువ వ్యవధి ఉండడం వల్ల నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని



తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం కూడా మెయిన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు రెండు నెలల సమయం ఇచ్చిందన్నారు. ఈసారి కూడా మెయిన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కనీసం రెండు నెలల గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రయోజనాల కోసం రాష్ట్ర యువత జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవడం సరికాదంటూ నారా లోకేశ్ హితవుపలికారు.



# రూ.10 కోట్లు అవసరం లేదు.. రూ.10 దువ్వెన చాలు

చెన్నై: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగుతోంది. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ స్వామీజీ ఉదయనిధిపై బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖలు చేసిన ఉదయనిధి తలపై రూ.10 కోట్ల రివార్డు ప్రకటించారు. ఆ పని ఎవరూ చేయడానికి ముందుకు రాకపోతే.. తానే చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ బెదిరింపులపై ఉదయనిధి స్పందిస్తూ.. 'నా ప్రాణాలకు ముప్పు ఉంది. నా తల కోసం రూ. 10 కోట్లు అవసరం లేదు. నా తల దువ్వుకోవడానికి పది రూపాయల దువ్వెన సరిపోతుంది. నాకోసం అంత మొత్తం వెచ్చించాల్సిన అవసరం లేదు. ఇలాంటి బెదిరింపులు మాకు కొత్తేమి కాదు. ఎవరి బెదిరింపులకు భయపడను. తమిళనాడు ప్రజల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన వ్యక్తి (కరుణానిధి) మనవడిని నేను 'అంటూ స్వామీజీ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఇదిలా ఉండగా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడటాన్ని ఆపేది లేదని ఉదయనిధి స్పష్టం చేశారు. అందరికీ అన్నీ దక్కాలన్నదే ద్రావిడ మోడల్ ఉద్దేశమని తెలిపారు. ఈ వ్యవహారంలో తనపై ఎలాంటి కేసులు వేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. దీంతో భాజపా, డీఎంకే మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# పండగపూటా పచ్చడి మెతుకులేనా?.. ఏపీ ఉద్యోగులకు జీతాలపై అచ్చెన్న వ్యాఖ్యలు

అమరావతి: గురుపూజోత్సవం రోజున కూడా పండితులకు జీతాలు వేయకుండా పండగ పూట కూడా పచ్చడి మెతుకులేనా? అంటూ వైసీపీ సర్కార్‌పై ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయులచే మద్యాన్ని అమ్మించిన నీచ చరిత్ర జగన్ రెడ్డిది అంటూ మండిపడ్డారు. సీపీయస్ ఉద్యమం చేశారని గురువులపై లాఠీ చార్జ్ చేయించారని, బైండోవర్ కేసులు, బాండ్లు వంటివి పెట్టారన్నారు. ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీని ఒక్క డీఎస్సీ నెరవేర్చలేదని విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టులు పెంచమని రూ.1,882 కోట్లు ప్రపంచ బ్యాంక్ నుంచి అప్పు తెచ్చుకున్నారన్నారు. బైజూస్, సీబీఎస్ఈ, టోఫెల్ అంటూ ముందస్తు చర్యలు లేకుండా అమలు చేస్తూ పాఠశాల విద్యను ప్రయోగశాలగా మార్చేశారని అచ్చెన్నాయుడు విరుచుపడ్డారు.






## డైరెక్టర్ కాళ్ల మీదపడి క్షమాపణలు అడిగిన హీరోయిన్!

వెటరన్ నటి లైలా ఒకప్పుడు ఎంత ఫేమస్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. ఎగిరేపావురమా తో టాలీవుడ్ కి పరిచయమైన లైలా చాలా సినిమాల్లో నటించింది. తమిళ..మలయాళ..కన్నడ భాషల్లోనూ మంచి గుర్తింపు దక్కించుకుంది. కెరీర్ పీక్స్ లో ఉండగానే ఓ బిజినెస్ మ్యాన్ వివాహం చేసుకున్నారు. అటుపై సినిమాలకు దూరమయ్యారు. కుటుంబ జీవితంలో అంకితమై మళ్లీ సినిమాల వైపు వచ్చింది లేదు. అయితే ఆ మద్య సర్దార్ సినిమాతో మళ్లీ తమిళ్ లో కంబ్యాక్ అయ్యారు. ప్రస్తుతం అక్కడ శబ్దం అనే సినిమా చేస్తున్నారు. అవకాశం వస్తే తెలుగు సినిమాల్లోనూ నటించాలని ఆసక్తి చూపిస్తున్నారు. పిల్లలు పెద్దవాళ్లు కావడంతో పాటు కొన్ని కుటుంబ బాధ్యతలు తగ్గాయి. ఈనేపథ్యంలో లైలా మళ్లీ మ్యాకప్ వేసుకుంటున్నారు. తాజాగా ఆమె ఓ యూ ట్యూబ్ ఛానెల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తిర విషయాలు పంచుకున్నారు. ఏకంగా దర్శకుడు బాలతోనే లైలా ఆవేశంతో తగాదాకి దిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత తప్పు తెలుసుకుని క్షమాపణలు అడిగారు అనుకోండి. ఆవేంటో ఆమె మాటల్లోనే.. 2001 లో నందా సినిమా చేసాను. అప్పటికి నాకు సరిగ్గా తమిళ్ రాదు. చాలా తప్పులొచ్చేవి. డైలాగులు సరిగ్గా చెప్పలేకపోయేదాన్ని. దీంతో



డైరెక్టర్ బాల పదే పదే తిట్టేవారు. అలా తిట్టడంతో నాకు బాగా కోపం వచ్చేది. కానీ అలా చాలాసార్లు కోపాన్ని అదిమి పెట్టా. కానీ ఓ రోజు మాత్రం పట్టలేనంత కోపం వచ్చేసింది. దీంతో దర్శకుడు ముందే అరిచేసా. సినిమా చేయనని బిగ్గరగా చెప్పాను. అప్పుడు నా దగ్గరకు కొంత మంది వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసారు. బాలా దర్శకత్వంలో పనిచేస్తే మంచి పేరు..గుర్తింపు వస్తుందని బ్రతిమలాడారు. నా లైఫ్ గురించి వాళ్లు అంతగా చెప్పడంతో అప్పటితో నా ఆవేశాన్ని తగ్గించుకున్నాను. అప్పుడు అలా ఉండటం నిజంగా నాకు ఎంతో పేరు తీసుకొచ్చింది. నందా రిలీజ్ రోజు థియేటర్ కి వెళ్లాడను. అక్కడ ప్రేక్షకులు హడావుడి..అరుపులు..కేకలు చూసి సర్ ప్రైజ్ అయ్యాను. తెరపై నేను ఇంత బాగా నటించానా? అన్న సందేహం నాకే కలిగింది. అది చూసి నేను షాక్ అయ్యాను. వెంటనే బాల దగ్గరకు వెళ్లి ఆయన కాళ్ల మీద పడి క్షమాపణలు అడిగాను. మీ కోపం ఎందుకో నాకు ఇప్పుడు అర్థమైంది అన్నాను. ఆ సినిమాకి గానూ ఉత్తమ నటి అవార్డు కూడా అందుకు న్నాను అని అన్నారు.

## మెగా హీరోతో జత కట్టబోతున్న కేతికా శర్మ..!

అప్పుడే ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్న హీరోయిన్లు పెద్ద పెద్ద స్టార్ హీరోల పక్కన ఛాన్స్ కొట్టేశారంటే... వారికి వచ్చే క్రేజ్ మామూలుగా ఉండదు. అంతకు ముందు వరకు చిన్న చిన్న సినిమాల్లో చేసినా.. ఆ తర్వాత స్టార్ హీరో సరసన కనిపించిందంటే చాలు ఎకాఎకిన అభిమానులు పెరిగిపోతుంటారు. మిల్క్ బ్యూటీ తమన్నా స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కూడా ఇలా... మెగా హీరోల చెంతన నటించే పాపులారిటీ పొందారు. అల్లు అర్జున్ రామ్ చరణ్ లతో నటించి ఆ సినిమా హిట్ అయినప్పటి నుంచి ఆ ముద్దుగుమ్మలు వెనక్కి తిరిగి చూసుకోలేదు. అయితే అలాంటి ఛాన్స్ కోసమే వేచి చూస్తున్న సెక్సీ హీరోయిన్ ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ క్రేజీ ఆఫర్ దక్కించుకుంది. పూరీ ఆకాశ్ సరసన రొమాంటిక్ చిత్రంలో నటించిన ఈ హాట్ బ్యూటీకి హిట్ సినిమాలు లేక తెగ ఇబ్బంది పడిపోతోంది. ఆ తర్వాత వచ్చిన నాగశౌర్య లక్ష్యం సినిమాలోనూ నటించింది. ఆ తర్వాత రంగ రంగ వైభవంగాలోనూ కనిపించినప్పటికీ ఏమాత్రం క్రేజ్ అందుకోలేకపోయింది. ఈ క్రమంలోనే ఓ పేరున్న హీరో పక్కన



నటిస్తే క్రేజ్ తో పాటు హిట్ వస్తుందని భావించింది. ఎట్టకేలకు సాయి ధరమ్ తేజ్ పక్కన ఛాన్స్ కొట్టేసింది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ దేవుడి పాత్రలో కనిపించబోతుండగా... ఆయన మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడిగా నటించబోతున్న సినిమా గురించి అందరికీ తెలిసిందే. అయితే మల్టీ స్టారర్ చిత్రంలో ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ ఛాన్స్ కొట్టేసింది. ముందు ఈమెనే ఎంపిక చేసినప్పటికీ.. ఆ తర్వాత చిత్రబృందం మరో హీరోయిన్ కోసం వెతుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు కేతికనే ఈ సినిమాలో నటించబోతున్నట్లు కన్ఫార్మ్ అయింది. అంతే కాదండోయ్ ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాబోతుంది ఫిబ్రవరి నెలాఖరు నుంచి కేతికా ఈ సినిమా షూటింగ్ లో పాల్గొనబోతుందట. అయితే కచ్చితంగా ఈ సినిమా కేతిక కెరియర్ గ్రాఫ్ ను పెంచుతుందని అంతా భావిస్తున్నారు. అదే గనక జరిగితే కృతి శెట్టి శ్రీలీలను కూడా కేతికా వెనక్కి నెట్టేస్తుందని టాలీవుడ్ కోడై కూస్తుంది. మరి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో సాయి ధరమ్ తేజ్ లతో నటించి ఈ మెహిట్ కొడుతుందో లేదో తెలియాలంటే ఇంకా కొంత కాలం ఆగాల్సిందే.

## స్టైలిష్ గ్లామర్ తో హీటెక్కిస్తున్న మంచు లక్ష్మి



డైలాగ్ కింగ్ మంచు మోహన్ బాబు వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది మంచు లక్ష్మి. మొదట యాంకరింగ్, పలు టీవీ షోలతో తన కెరీర్ మొదలుపెట్టిన ఆమె ఆ తర్వాత వెండి తెరపైకి కూడా అడుగుపెట్టారు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. మంచు లక్ష్మి వయసు పెరుగుతున్నా చాలా అందంగా కనిపిస్తూ ఉంటారు. దానికి ఆమెకు ఫిట్నెస్ పై ఉన్న ఫోకసే కారణం. ఫిట్నెస్ విషయంలో ఆమె ఎక్కడా వెనక్కి తగ్గదు. కఠినమైన వ్యాయామాలు చేస్తూ ఉంటారు. ప్రతిరోజూ యోగా కూడా సాధన చేస్తూ ఉంటారు. అందుకే, చాలా ఫిట్ గా, ఆరోగ్యంగా, అందంగా కనిపిస్తూ ఉంటారు. తాజాగా ఆమె జిమ్ వేర్ లో దర్శనమిచ్చారు. పింక్ కలర్ టాప్ కి బ్లాక్ కలర్ బాటమ్ ధరించారు. చేతిలో డంబెల్స్ కూడా ఉన్నాయి. ఆమె జిమ్ వేర్ లో ఉన్న ఫోటోలో వావ్ మ్యాగజైన కవర్ పేజీపై ముద్రించడం విశేషం. 'స్లిమ్, స్ట్రాంగ్, సెక్సీ' అంటూ ఆ కవర్ పేజీ పై రాసి ఉండటం విశేషం. ఈ ఫోటోని ఆమె షేర్ చేయగా, నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. సూపర్ , హాట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిజానికి చాలా మంది మంచు లక్ష్మి మాట్లాడే మాటలు, మాట్లాడే విధానాన్ని ట్రోల్ చేస్తూ ఉంటారు. కానీ, ఆమె సమాజానికి చాలా మేలు చేసే పనులు చేస్తూ ఉంటారు. స్కూళ్లను దత్తత తీసుకోవడం, ఆ స్కూల్లోని పిల్లలకు మంచి విద్య, అని వసతులు అందించేలా ఆమె కృషి చేస్తూ ఉంటారు. ఈ విషయాల గురించి మాత్రం చాలా మంది చాలా తక్కువగా మాట్లాడుతూ ఉంటారు. ఇక,మంచు లక్ష్మి సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన , తన కూతురుకు సంబంధించిన వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. యూట్యూబ్ లోనూ కొన్ని వీడియోలు పుంచుకున్నారు ఆమె. ఇక ఆమె తన ఫోటోలను కూడా షేర్ చేస్తూ ఉంటారు. ఇక, ఆమె నటిగా తెలుగుతోపాటు తమిళంలోనూ మెరిసింది. ఇటీవల మలయాళంలో ఓ సినిమా చేయడం విశేషం.రీసెంట్ గా మానిస్టర్ మూవీలో లెస్బియన్ గా నటించి షాకిచ్చింది.

## పొట్టి నిక్కరు చిట్టి గౌనులో గాయని కం నటి



గాయని కం నటి ఆండ్రియా పరిచయం అవసరం లేదు. ప్రముఖ సంగీతదర్శకుడు అనిరుధ్ తో ప్రేమాయణం సాగించి చివరికి బ్రేకప్ తో డిప్రెషన్ ని ఫేస్ చేసిందని తమిళ మీడియాల్లో కథనాలొచ్చాయి. కానీ వేటినీ ఆండ్రియా ధృవీకరించలేదు. చాలా కాలం తన ఒత్తిళ్ల జీవితం గురించి అనారోగ్యం గురించి కలత చెందానని ఇంతకుముందు వెల్లడించినా కానీ ఇప్పుడు అన్నివిధాలా కెరీర్ పైనే ఆండ్రియా దృష్టి సారించింది. సింగర్ కం నటి ఆండ్రియా కేవలం హాట్ హీరోయిన్ గానే కాదు.. తనదైన హస్కీ వాయిస్ తో తెలుగు పరిశ్రమకు పాటలు పాడి స్పెల్ బౌల్డ్ చేసిన సంగతి తెలిసిందే. చెన్నయ్ టు హైదరాబాద్ ఆండ్రియాకి గాయనిగానే బోలెడంత పాపులారిటీ ఉంది. ఇంతకుముందు నాగచైతన్య 'దడ' సహా పలు తెలుగు చిత్రాల్లో తనదైన గానంతో అలరించింది. హస్కీ వాయిస్ తో కిక్కిచ్చే గానం ఆండ్రియాకి పేరు తెచ్చింది. 'యుగానికి ఒక్కడు' చిత్రంతో కథానాయికగా స్పైసీ లుక్ తో అలరించింది. ఆండ్రియా నటించిన వరుస చిత్రాలు తెలుగులో విడుదలయ్యాయి. కొన్ని డబ్బింగులు ఆకట్టుకున్నాయి. కానీ ఎందుకనో సౌత్ లో స్టార్ హీరోయిన్ గా వెలగాలని కలలు గన్న ఈ బ్యూటీ రకరకాల వ్యక్తిగత కారణాలతో రేసులో వెనకబడింది. మరోవైపు ఆండ్రియా సోషల్ మీడియాల్లోను యాక్టివ్ గా ఉంది. ఒంటరి బీచ్ లో సుదూర తీరంలో ఇలా పొట్టి నిక్కరుతో ప్రత్యక్షమై కుర్రకారు గుండెల్లో గుబులు పెంచింది. వైట్ డెనిమ్ షార్ట్.. కాంబినేషన్ గా చిట్టి పొట్టి గౌన్ ని ధరించిన ఆండ్రియా బీచ్ లో నవ్వులు చిందిస్తూ కుర్రకారు గుండెల్ని గిచ్చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. లైఫ్ జర్నీలో గందరగోళం నుంచి బయటపడిన ఆండ్రియా ఇటీవల పూర్తిగా కెరీర్ పైనే శ్రద్ధ పెట్టింది. ఇంతకుముందు మాస్టర్ చిత్రంలో ఆండ్రియా కీలక పాత్రలో కనిపించింది. ఇటీవల నాలుగైదు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇవన్నీ సెట్స్ లో ఉన్నాయి. కమలా కన్నన్ దర్శకత్వంలో 'వట్టామ్'.. మిస్కిన్ దర్శకత్వంలో 'పిసాసు-2' లో నటిస్తోంది. వీటన్నిటికీ సంబంధించిన తాజా అప్ డేట్లు రావాల్సి ఉంది. కా - మాలిగై- నో ఎంట్రీ సహా మరో రెండు చిత్రాల్లోను ఆండ్రియా నటిస్తూ బిజీగా ఉంది.

## జగ్గూభాయ్.. ఏజ్ పెరుగుతుందా.. తగ్గుతుందా?

తెలుగు ప్రేక్షకులకు జగపతిబాబు గురించి స్పెషల్ గా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఆయన ఒక వర్సిటైల్ యాక్టర్. సినీ బ్యాగ్రౌండ్ నుంచి వచ్చి జగపతి బాబు తన కెరీర్ ని మొదలుపెట్టారు. అయితే, మొదట్లో వరస వైఫల్యాలు ఎదురైనా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. తర్వాత ఫ్యామిలీ హీరోగా తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరిగిపోని ముద్ర వేశారు. జగపతి బాబు సినిమాలు అంటే మహిళలు ఎక్కువగా ఇష్టపడి చూసేవారు. హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించిన ఆయన, ఇప్పుడు తన పంథా మార్చుకున్నారు. నిజానికి హీరోగా ఒక ముద్ర వేసుకున్నవారు తర్వాత విలన్ రోల్స్ చేయడానికి పెద్దగా ఆసక్తి చూపించరు. కానీ, ఆయన తన కమ్ బ్యాక్ ని విలన్ రోల్స్ తో మొదలుపెట్టారు. స్టార్ హీరోల్లో విలన్ కావాలి అంటే,



జగపతిబాబు బెస్ట్ ఆప్షన్ అనే రేంజ్ మారిపోయారు. అప్పటి నుంచి ఆయన మళ్లీ వెనక్కి తిరిగి చూసుకున్నది లేదు. పాన్ ఇండియా సినిమాల్లోనూ విలన్ రోల్స్ ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతున్నారు. వరసగా, ఒక దాని వెంట మరో సినిమా చేసుకుంటూ వెళుతున్నారు. ఇక, సోషల్ మీడియాలోనూ జగపతి బాబు చురుకుగా ఉంటారు. అప్పుడప్పుడు కొన్ని వీడియోలు షేర్ చేయడం, తన ఫోటోలు పంచుకోవడం లాంటివి చేస్తుంటారు. తాజాగా పింక్ అవుట్ ఫిట్ లో ఆయన షేర్ చేసిన ఫోటోలు చూసి ప్రేక్షకులే స్టన్ అవుతున్నారు. ఎందుకంటే , ఆ ఫోటోల్లో జగపతి బాబు అంత స్టన్నింగ్ గా ఉన్నారు. ఇప్పటి వరకు జగ్గూ బాయ్ ని చాలా గెటప్స్ లో చూసే ఉంటారు. కానీ, ఇంత స్టైలిష్ చూడటం చాలా అరుదు అనే చెప్పాలి. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఆ ఫోటోలు చూస్తుంటే జగ్గూ భాయ్ వయసు పెరుగుతుందా తగ్గుతుందా అనే అనుమానం కలగమానదు. ఆయన అంత స్టైలిష్ గా ఉన్నారు. వావ్, సూపర్ అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## సీత.. ఇలా చేశావేంటి?

మృణాల్ ఠాగూర్ సీతారామం సినిమాతో ఒక్కసారిగా అందరి కలల రాణిగా మారిపోయింది. ఇక ఈ బ్యూటీ యాక్టింగ్ కు యూత్ ఫ్యామిలీ ఆడియన్స్ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యారు. ఒక్క సినిమాతో సౌత్ లోని ప్రతి ఫిల్మ్ ఇండస్ట్రీలో మృణాల్ ఠాగూర్ సీతారామం సినిమాతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఇక ఆమెను సీతా అంటూ పిలుస్తూ.. ప్రేమ కురిపిస్తున్నారు. ఇక ఈ బ్యూటీ ఆన్ స్క్రీన్ పై ఉన్న హెూమ్లీ లుక్ ఆఫ్ స్క్రీన్ లో కాస్త ట్రెండీగానే కనిపిస్తుందనే చెప్పాలి. బయట మాత్రం మృణాల్ ఠాకూర్... మోడరన్ లుక్ లో కనిపిస్తుంది. కొంతమంది దీనిపై కామెంట్స్ కూడా పెట్టారు. సీతా ఇలాంటి బట్టలు వేసుకోవద్దు అంటూ కామెంట్స్ పెట్టేవారు.



తాజాగా మరోసారి మృణాల్ ఠాకూర్ గురించి ఇలాంటి కామెంట్స్ యే వినిపిస్తున్నాయి ఇందుకు కారణం ఒక సాంగ్. అక్షయ్ కుమార్ ఇమ్రాన్ హష్మీ కలిసి నటిస్తున్న సెల్ఫీ సినిమా నుంచి కుడియె నీ తెరి అనే సాంగ్ ను విడుదల చేశారు. ఈ సాంగ్ లో మృణాల్ ఠాగూర్ నటించింది. ఇక ఈ పాటలో మృణాల్ ఠాకూర్ గ్లామర్ షో మునుపెన్నడూ లేని విధంగా.. మోడరన్ లుక్ లో కనిపించింది. క్యారెక్టర్ పరంగా చూస్తే సెల్ఫీ సినిమాలో ఆమెది ఒక హీరోయిన్ రోల్ అని తెలుస్తోంది. కుడియె నీ తెరి సాంగ్ కూడా హీరో పాత్రలో నటిస్తున్న అక్షయ్ కుమార్ కి హీరోయిన్ పాత్రలో నటిస్తున్న మృణాల్ ఠాకూర్ కి మధ్య సినిమా షూటింగ్ లో భాగంగా ఉంటుంది. అందుకే సాంగ్ ని అంత గ్లామర్ గా తెరకెక్కించారని సమాచారం. ఈ వీడియో సాంగ్ లో మృణాల్ ఠాకూర్ ని చూసిన వాళ్లు సీత నువ్వు కూడా ఈ రేంజులో చూపిస్తావ్ అనుకోలేదు అంటూ కామెంట్స్ పెడుతున్నారు.



# దుబాయిలో కేటీఆర్ పర్యటన.. తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

హైదరాబాద్ : దుబాయిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతంగా ప్రారంభమైంది. తన పర్యటనలో భాగంగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు కేటీఆర్. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి భారీ పెట్టుబడితో మంత్రి కేటీఆర్ తన పర్యటన ప్రారంభించారు. అగ్నిమాపక సామాగ్రి తయారీలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన యూఏఈ దిగ్గజ సంస్థ NAFFCO కంపెనీ తెలంగాణ రాష్ట్రంలో రూ. 700 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌తో కంపెనీ సీఈవో ఖాలిద్ అల్ ఖతిబ్ ప్రతినిధి బృందం సమావేశమైంది. తెలంగాణ రాష్ట్రంలో తమ అగ్నిమాపక సామాగ్రిని తయారు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. ఇందులో భాగంగా రూ. 700 కోట్ల భారీ పెట్టుబడిని పెడుతున్నట్లు తెలిపింది. తెలంగాణతోపాటు భారతదేశం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అగ్నిమాపక సామాగ్రి, అగ్నిమాపక సేవల అవసరం భవిష్యత్తులో భారీగా పెరుగుతుందని విశ్వాసం తమకుందని నాఫ్‌కో తెలిపింది. తెలంగాణలో ఏర్పాటు చేయనున్న అగ్నిమాపక సామాగ్రి తయారీ ప్లాంట్ భారతదేశ డిమాండ్‌కు సరిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతోపాటు తెలంగాణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలన్న మంత్రి కేటీఆర్ ప్రతిపాదనకు కంపెనీ అంగీకారం తెలిపింది. ఈ ట్రైనింగ్ అకాడమీ ద్వారా దాదాపు 100కు పైగా దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తమ సంస్థ నైపుణ్యాన్ని, అగ్నిమాపక శిక్షణను తెలంగాణ కేంద్రంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ సీఈవో మంత్రి కేటీఆర్‌కు తెలియజేశారు.




హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఈమేరకు ఇవాళ సెలవు ప్రకటిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మరోవైపు రాష్ట్రంలో పలు జిల్లాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

7 జిల్లాలకు రెడ్ హెచ్చరికలు, 17 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు, 9 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

**రెడ్ హెచ్చరికలు జారీ అయిన జిల్లాలు:** హైదరాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి **ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయిన జిల్లాలు:** జగిత్యాల, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, ములుగు, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వరంగల్, హనుమకొండ **ఎల్లో హెచ్చరికలు జారీ అయిన జిల్లాలు:** ఆదిలాబాద్, కుమురం భీం, జోగులాంబ గద్వాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, వనపర్తి

# బండి సంజయ్ తీరుపై హైకోర్టు అసహనం.. అసలేం జరిగిందంటే..



హైదరాబాద్ : మంత్రి గంగుల కమలాకర్ ఎన్నిక వివాదంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. కరీంనగర్ ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్ ఎన్నిక చెల్లదన్న బీజేపీ నేత బండి సంజయ్ పిటిషన్ పై విచారణ జరిగింది. పిటిషన్ వేసిన బండి సంజయ్ తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరయ్యేందుకు పలుమార్లు గడువు కోరడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. క్రాస్ ఎగ్జామినేషన్‌కు జూలై 21 నుంచి మూడుసార్లు బండి సంజయ్ గడువు కోరారు. ప్రస్తుతం బండి సంజయ్ అమెరికాలో ఉన్నందున గడువు ఇవ్వాలని ఇవాళ మరోసారి న్యాయవాది కోరారు. ఎన్నికల పిటిషన్లు ఆరు నెలల్లో తేల్చాల్సి ఉన్నందున.. విచారణ ముగిస్తామని హైకోర్టు పేర్కొంది. ఈనెల 12న అమెరికా నుంచి వచ్చాక బండి సంజయ్ హాజరవుతారని న్యాయవాది అభ్యర్థించారు. సైనిక సంక్షేమ నిధికి రూ. 50 వేలు చెల్లించాలని బండి సంజయ్‌కి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలంటే సంజయ్ రూ.50 వేలు చెల్లించాలని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణ ఈ నెల 20కి హైకోర్టు వాయిదా వేసింది.

# మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు ఈడీ నోటీస్

హైదరాబాద్ : మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు ఈడి నోటీస్ జారీ చేసింది. గంగులకు చెందిన శ్వేతా గ్రానైట్స్ ఫెమ నిబంధనలు ఉల్లంఘించినందున ఈ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. గ్రానైట్స్ ఎక్స్‌పోర్ట్స్ ద్వారా ఫెమా నిబంధనలో రూ. 4.8 కోట్ల ఫ్రాడ్‌కి శ్వేత ఏజెన్సీస్ పాల్పడినట్టు సమాచారం. చైనాకు గ్రానైట్ మెటీరియల్ ఎక్స్‌పోర్ట్ చేయటంలో అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులో కేవలం శ్వేతా ఏజెన్సీస్ రూ.3 కోట్లు చెల్లించింది.

ఇంకా సుమారు 50 కోట్ల వరకూ పెండింగ్ ఉంది. హవాలా మార్గంలో డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్టు ఈడి వద్ద ఆధారాలు లభించాయి. గత ఏడాది నవంబర్‌లో శ్వేతా ఏజెన్సీస్‌పై ఈడీ సోదాలు



నిర్వహించింది. గతంలో విజిలెన్స్ రిపోర్టు ప్రకారం 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను అక్రమంగా తరలించినట్లు గుర్తించారు.

# విలువలతో కూడిన విద్యతోనే మెరుగైన సమాజం సాధ్యం : మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : భారతీయ తాత్విక దృక్పథాన్ని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన గురు పూజోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన అరుదైన ఘనత సర్వేపల్లి సొంతం అన్నారు. మహనీయుల స్ఫూర్తితో విద్యారంగంలో వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టడమే కాకుండా.. పెను మార్పులు చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది అన్నారు. అన్ని వర్గాల పేద బిడ్డలకు కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ నెలకొల్పిన గురుకులాలు అద్భుత ఫలితాలు సాధిస్తూ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయని అన్నారు. వాటికి వస్తున్న భారీ స్పందనే దీనికి నిదర్శనం అన్నారు. దీంతో గురుకులాలను యేటా పెంచుతూ పోతున్నారన్నారు. ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర సర్కారు రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నదన్నారు. విద్యారంగంలో కేసీఆర్ తెచ్చిన గురుకులాలు కొత్త చరిత్రకు నాంది పలికాయన్నారు. ప్రైవేట్ బాట వీడి గురుకులాల్లో చాలా మంది విద్యార్థులు చేరుతున్నారంటే.. వీటిని ఏ స్థాయిలో అభివృద్ధి పర్చారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు ఉండగా.. వేలాది మంది విద్యను అభ్యసిస్తూ లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యారంగంలో కొత్త శకం ఆవిష్కృతం అవుతుందన్నారు. ఈ విజయంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది అని కొనియాడారు. సమాజానికి దిక్సూచి 'ఉపాధ్యాయుడు' అని కొనియాడారు. మంచి సమాజం తయారు కావాలంటే మంచి విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.




భారీ వర్షాల కారణంగా హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రహదారులపై భారీగా వరద నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఆరాంఘర్ జాతీయ రహదారిపై, శ్రీనగర్ సమీపంలో ఆర్టీసీ బస్సులు వరదలో చిక్కుకుపోయాయి. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు, ట్రాఫిక్ పోలీసులు అతికష్టం మీద ఆ బస్సులను వరద నుంచి బయటకు తీశారు.

# ప్రజలు అవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావొద్దు: మంత్రి తలసాని



హైదరాబాద్: రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్ వర్క్స్ ఎండీ దాన కిషోర్, ట్రాన్స్ కో ఎండీ, ఈవీడీఎం డైరెక్టర్, హైదరాబాద్ కలెక్టర్‌తో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎక్కడ నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెట్లు, కొమ్మలు కూలిన చోట నుంచి వెంటనే తొలగించాలని సూచించారు. హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నాలాల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ జరపాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. అత్యవసర సేవలకు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ నంబర్లు 040-21111111, 23225397లో సంప్రదించాలన్నారు. నగర ప్రజలు వర్షాల వల్ల తలెత్తే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సూచించారు. ఈవీడీఎం కంట్రోల్ రూమ్ 9000113667కు ఫోన్ చేయాలన్నారు. హైదరాబాద్ ప్రజలు అత్యవసరమైతేనే ఇండ్లనుంచి బయటకు రావాలన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహిస్తాం



హైదరాబాద్ : తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17ను గత సంవత్సరం మాదిరిగానే సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సారి కూడా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే అధికారికంగా నిర్వహిస్తామన్నారు. అతిథులుగా ఎవరు వస్తారన్నది ఇంకా కన్ఫర్మ్ కాలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవగా ముందు కేసీఆర్ అధికారకంగా నిర్వహిస్తామన్నారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తరువాత.. అధికారంలోకి వచ్చి ఇప్పుడు మాట తప్పారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

మజ్లిస్ పార్టీకి ఒవైసీ ఒత్తిడి తలొగ్గి విమోచన కార్యక్రమాలు చేయడం లేదని కిషన్ రెడ్డి విమర్శించారు. ఒవైసీ కేసీఆర్ భయపడి కార్యక్రమాలు చేయడం లేదన్నారు. ఆనాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణ గడ్డపైనా జెండా ఎగురవేశారన్నారు. ఇప్పుడు 70 ఏళ్ల తరువాత మళ్లీ అభినవ సర్దార్ వల్లభాయ్ పటేల్ అయిన అమిత్ షా జెండా ఎగుర వేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అమృత్ మహోత్సవాలు చేశామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు ఎత్తివేత.. మూసీలో పెరుగుతున్న వరద

హైదరాబాద్: హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో జంట జలాశయాలకు వరద పోటెత్తింది. ఇప్పటికే నిండు కుండల్లా ఉండటంతో అధికారులు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లను ఎత్తివేశారు. హిమాయత్ సాగర్‌లో నాలుగు గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే కిందికి వదిలేస్తున్నారు. హిమాయత్ సాగర్‌లో ప్రస్తుతం 1764 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ఇక ఉస్మాన్ సాగర్ జలాశయంలో రెండు గేట్లను ఎత్తివేశారు. దీంతో మూసీ నదిలోకి భారీగా వరద నీరు వస్తున్నది. ఈనేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జలమండలి అధికారులు అప్రమత్తం చేశారు. చాదర్‌ఘాట్‌లో లోయర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న కాలనీ వాసులను



ఇండ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మూసారం బ్రిడ్జి వద్ద వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీ రఘుమారెడ్డి సమీక్ష నిర్వహించారు. సంస్థ పరిధిలోని చీఫ్ జనరల్ మేనేజర్, సూపరింటెండెంట్ ఇంజినీర్లతో ఆయన ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విద్యుత్ సరఫరా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడే సమయంలో సాధారణ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు స్వీయ జాగ్రత్తలు పాటించాలని సీఎండీ కోరారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

**సీఎండీ చేసిన సూచనలు..** వర్షాలు పడేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల క్రింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలబడకుండా వీలైనంతవరకు వాటికి దూరంగా ఉండాలి. పశువులు, పెంపుడు జంతువులను కూడా విద్యుత్ పరికరాల నుంచి దూరంగా ఉంచాలి. ఎక్కడైనా రోడ్లు, నీటిలో విద్యుత్ తీగ పడి ఉంటే దాన్ని తొక్కడం.. వాటి మీద నుంచి వాహనాలు నడపడం వంటివి చేయొద్దు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడినట్లు ఉంటే వెంటనే సమీపంలోని విద్యుత్ సిబ్బందికి లేదా హెల్ప్‌లైన్ల ద్వారా సంస్థ దృష్టికి తీసుకురావాలి. చెట్ల కొమ్మలు, వాహనాలు, ఇతర భవనాలపై తెగి పడ్డ తీగలు ఉన్నట్లయితే వెంటనే సంస్థ దృష్టికి తీసుకురావాలి. భారీ గాలులు, వర్షం పడేటప్పుడు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు ఉన్నట్లయితే విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసి వెంటనే కంట్రోల్ రూమ్‌కి తెలియజేయాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్ రూమ్‌కు సంప్రదించే వినియోగదారులు తమ బిల్లుపై ముద్రించిన USC నంబర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. లోతట్టు ప్రాంతాలు, అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి వరదనీరు చేరితే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలి. విద్యుత్‌కి సంబంధించి ఎలాంటి అత్యవసర పరిస్థితి ఉన్నా 1912, 100 స్థానిక ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్‌తో పాటు విద్యుత్ శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్లు 73820 72104, 73820 72106, 73820 71574కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. దీంతో పాటు సంస్థ మొబైల్ యాప్, వెబ్‌సైట్, సోషల్ మీడియా ద్వారా కూడా విద్యుత్ సంబంధిత సమస్యలను మా దృష్టికి తీసుకురావొచ్చు.

# పెళ్లికి నిరాకరించిందనే దారుణం.. ఎల్బీనగర్ ఘటనలో ప్రేమోన్మాది దాడికి కారణమిదే

హైదరాబాద్: రాజధాని ఎల్బీనగర్‌లో కలకలం రేపిన ప్రేమోన్మాది దాడి కేసులో నిందితుడు పొంతనలేని సమాధానాలు చెబుతూ పోలీసుల్ని తిప్పలు పెట్టాడు. ఆదివారం సాయంత్రం శివకుమార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించే క్రమంలో ఒక్కోసారి ఒక్కో విధంగా సమాధానమిచ్చినట్లు తెలిసింది. బాధితురాలు సంఘవిని పెళ్లి చేసుకోవాలనుకున్నానంటూ ఒకసారి.. తనకేమీ తెలియదంటూ మరోసారి బదులిచ్చినట్లు తెలుస్తుంది. వాస్తవాలు వెలికితీసేందుకు సోమవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో నిందితుడితో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించారు. అనంతరం వాంగ్మూలం నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

**పూర్వ విద్యార్థుల సమ్మేళనం నుంచే..** ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీలో అద్దె ఇంట్లో సోదరులు పృథ్వీ, రోహిత్, మరో బంధువు శ్రీనివాస్‌తో సంఘవి కలిసి ఉంటోంది. కొన్ని నెలల క్రితం సంఘవి చదివిన పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. అప్పుడే సంఘవిని, శివకుమార్ మళ్లీ కలిశాడు. ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానంటూ వేధింపులు మొదలుపెట్టాడు. రామంతాపూర్‌లో చదువుతోందనే విషయం తెలుసుకుని నగరానికి మకాం మార్చాడు.

**కఠినంగా శిక్షించాలి :** ఈ ఘటనలో మరణించిన యువతి సోదరుడు పృథ్వీ మృతదేహానికి సోమవారం ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడ్డ సంఘవిని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని యువతి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. సంఘవి సోదరుడు రోహిత్ మాట్లాడుతూ.. శివకుమార్ జైలు నుంచి బయటకొస్తే మా సోదరిని చంపేందుకు వెనుకాడడని, అతన్ని శిక్షించాలని పేర్కొన్నాడు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com